ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888



పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888



Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -106 సోమవారం 3 ఆగస్టు 2026


# 4 ఏపీ, ఆస్ట్రేలియా మధ్య ఒప్పందాలు

- ఐఐటీ తిరుపతిలో సోలార్ తయారీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు
- విద్యార్థుల మానసిక ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- మంత్రి లోకేష్ ఆస్ట్రేలియా పర్యటన ఫలితంగా కుదిరిన ఎంవోయూలు
- లోకేష్, ఆస్ట్రేలియా మంత్రి జూలియన్ హిల్ సమక్షంలో సంతకాలు



**అమరావతి ఆగష్టు 2, (రిపబ్లిక్ న్యూస్):**
ఆంధ్రప్రదేశ్, ఆస్ట్రేలియా మధ్య బంధం మరింత బలపడింది. క్లీన్ ఎనర్జీ, అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్, విద్య, నైపుణ్యాభివృద్ధి వంటి కీలక రంగాల్లో సహకారాన్ని పెంచుకుంటూ ఇరుపక్షాలు నాలుగు వ్యూహాత్మక ఒప్పందాలు (ఎంవోయూలు) కుదుర్చుకున్నాయి. ఉండవల్లిలో శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్, ఆస్ట్రేలియా అంతర్జాతీయ విద్య, అభివృద్ధి సహాయ మంత్రి జూలియన్ హిల్ హాజరయ్యారు. ఇటీవల మంత్రి నారా లోకేశ్ ఆస్ట్రేలియాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఆ పర్యటన సందర్భంగా అక్కడి సంస్థలతో జరిపిన చర్చలు, ఏపీలో పెట్టుబడులకు ఇచ్చిన ఆహ్వానం ఫలితంగానే ఈ ఒప్పందాలు సాకారమయ్యాయి.

**1. ఐఐటీ తిరుపతిలో సోలార్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్**
మొదటి ఒప్పందం ప్రకారం, విశాఖలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్ (జశీజుజు), ఐఐటీ తిరుపతి, ఆస్ట్రేలియాలోని

మిగతా 2లో.

# వికసిత భారత్ కోసం డ్రగ్స్‌కు దూరం

## .. యువతకు ప్రధాని మోదీ పిలుపు

- వికసిత భారత్ సంకల్ప అభియాన్‌లో భాగంగా 'నశా ముక్త్ యువ' ప్రారంభం
- మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలంటూ యువతకు ప్రధాని మోదీ పిలుపు
- దేశవ్యాప్తంగా ప్రతి ఆదివారం క్రీడలు, అవగాహన కార్యక్రమాల నిర్వహణ
- గతేడాది కాశీలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైనట్లు వెల్లడించిన ప్రధాని



**ఢిల్లీ ఆగష్టు 2, (రిపబ్లిక్ న్యూస్):**
దేశ యువత మాదకద్రవ్యాల (డ్రగ్స్) మహమ్మారికి దూరంగా, శారీరకంగా, మానసికంగా సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నప్పుడే 'వికసిత భారత్' సంకల్పం నెరవేరుతుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో నేటి తరం యువత చూపిస్తున్న నిబద్ధత, సామాజిక స్పృహ తన నమ్మకాన్ని మరింత బలపరిచాయని ఆయన ప్రశంసించారు.

మిగతా 2లో.



# యుద్ధానికి బ్రేక్..

- ఇరాన్‌తో ఒప్పందం కుదిరిందన్న ట్రంప్
- ఇరాన్‌పై జరపాల్సిన దాడులను రద్దు చేసుకున్నట్టు ప్రకటించిన ట్రంప్
- ఇరాన్, పశ్చిమాసియా దేశాల విజ్ఞప్తి మేరకే ఈ నిర్ణయమన్న అధ్యక్షుడు
- హర్మూజ్ జలసంధిని తెరవాలనేది ఒప్పందంలో కీలక షరతు
- ఒప్పందానికి ఇజ్రాయెల్ కూడా అంగీకరించిందని వెల్లడి
- అమెరికా దూకుడుగా వ్యవహరిస్తే తిప్పికొడతామని ఇరాన్ హెచ్చరిక

ఇరాన్ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనూహ్య ప్రకటన చేశారు. ఇరాన్‌పై వారాంతంలో జరపాల్సిన దాడులను రద్దు చేసుకున్నట్టు ఆదివారం వెల్లడించారు. ఇరాన్‌తో పాటు ఇతర పశ్చిమాసియా దేశాలు చేసిన విజ్ఞప్తి మేరకే ఈ నిర్ణయం తీసుకున్నానని, ఓ ఒప్పందానికి

మిగతా 2లో.

# రాష్ట్రాలకు ఫండింగ్

## ఏపీకి 4,597, తెలంగాణకు 2,370 కోట్లు

- ముందే పన్నుల వాటా నిధులు.. కేంద్రం సర్ప్రైజ్
- అడగకుండానే లక్ష కోట్లకు పైగా విడుదల
- ఉత్తరాదికి పెద్దమొత్తంలో దక్కిన నిధులవాటా
- అత్యధికంగా యూపీకి 19,208, బీహారు 10,845 కోట్లు




**ఢిల్లీ ఆగష్టు 2, (రిపబ్లిక్ న్యూస్):**
రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం ఊహించని సర్ప్రైజ్ ఇచ్చింది. అభివృద్ధి పనుల వేగాన్ని పెంచడమేలక్ష్యంగా భారీ ఆర్థిక సాయాన్ని అందించింది. మామూలుగా ప్రతినెల ఇచ్చే పన్నుల వాటాతోసంబంధం లేకుండా, ఒకేసారి ఏకంగా 71,09,019 కోట్లను అడ్వాన్స్ వాయిదా రూపంలో రాష్ట్రాల ఖజానాలోకి జమ చేసింది. సాధారణంగా ప్రతి నెలా 10వ తేదీన కేంద్ర పన్నుల వాటా నిధులురాష్ట్రాలకు అందుతాయి. అయితే, ఈసారి ఆగస్టు 10న ఇచ్చే రెగ్యులర్ నిధులకు అదనంగా, పదిరోజుల ముందే ఈ భారీ అడ్వాన్సును కేంద్రం రిలీజ్ చేసింది. రాష్ట్రాల్లో

మిగతా 2లో.

# వైసీపీ ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్ట్..

- ఆలూరు వైసీపీ ఎమ్మెల్యే విరూపాక్షిని అరెస్ట్ చేసిన పోలీసులు
- టీడీపీ కార్యకర్త ఇంటిపై దాడి చేశారన్న ఆరోపణలు
- ఎమ్మెల్యేతో పాటు మరో 14 మందిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు
- ఆలూరు జూనియర్ సివిల్ జడ్జి ఎదుట నిందితుల హాజరు
- అక్రమ అరెస్ట్ అంటూ వైసీపీ ఆరోపణ.. ఖండించిన ప్రభుత్వం



2లో.



2లో.

# దేశంలో రుతుపవనాల వింత పోకడ..

## ఒకచోట కుండపోత, మరోచోట ఉక్కపోత!

- దేశంలో అసమానంగా విస్తరించిన రుతుపవనాలు
- జాతీయ స్థాయిలో 11 శాతం వర్షపాత లోటు నమోదు
- పశ్చిమ భారత్‌లో దట్టమైన మేఘాలు.. ఉత్తరాదిన నిర్మలమైన ఆకాశం
- ఉపగ్రహ చిత్రాల ద్వారా రుతుపవనాల వ్యత్యాసాన్ని చూపిన ఐఎండీ
- ఆగస్టు 3 నుంచి ఉత్తర భారతంలో వర్షాలు మెరుగుపడే అవకాశం

# తక్కువ ధరకే బియ్యం..

- సామాన్యులకు ఊరటనిస్తూ ప్రభుత్వ బియ్యం అమ్మకాలు
- విజయవాడలో కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి నాదెండ్ల మనోహర్
- రైతు బజార్లు, మిల్లుల్లో కేజీ రూ. 50, రూ. 52కే బియ్యం
- త్వరలో కందిపప్పు, పామాయిల్ కూడా తక్కువ ధరకే

2లో.





2లో.

# లష్కర్ బోనాల్లో సీఎం రేవంత్ రెడ్డి..

- మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు
- సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న సీఎం రేవంత్
- ప్రభుత్వం తరపున జగన్మాతకు పట్టువస్త్రాలు, బోనం సమర్పణ
- ముఖ్యమంత్రితో పాటు పాల్గొన్న మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీతక్క

# వికసిత భారత్ కోసం డ్రగ్స్‌కు దూరం

**మొదటిపేజీ తరువాయి**

నేడు 'నశా ముక్త్ యువ ఫర్ వికసిత భారత్ సంకల్ప్ అభియాన్' కార్యక్రమాన్ని ప్రధాని వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ప్రారంభించి ప్రసంగించారు. దేశవ్యాప్తంగా యువతను ఏకతాటిపైకి తెచ్చి, మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమంలో భాగస్వాములను చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. 'మై భారత్' వాలంటీర్ల నేతృత్వంలో ఇది ఒక ప్రజా భాగస్వామ్య (జన్ భాగీదారీ) ఉద్యమంగా రూపుదిద్దుకుంది. "మనం ఒక గొప్ప, ముఖ్యమైన సంకల్పం కోసం ఇక్కడ సమావేశమయ్యాం. ఈ కార్యక్రమం కేవలం ఒక వ్యక్తి, కుటుంబం లేదా సమాజం కోసం కాదు. ఇది దేశం కోసం. వికసిత భారత్ దిశగా దేశం అడుగులు వేస్తున్నప్పుడు, యువత డ్రగ్స్ సమస్యకు దూరంగా ఉండటం అత్యవసరం" అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా కాశీతో ఈ కార్యక్రమానికి ఉన్న అనుబంధాన్ని ప్రధాని గుర్తుచేసుకున్నారు. "కాశీ ఎంపీగా, ఈ కార్యక్రమం గతేడాది పవిత్ర కాశీ క్షేత్రంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభం కావడం నాకు చాలా సంతోషాన్నిచ్చింది. దీనివల్ల ఈ కార్యక్రమానికి శాస్త్రీయ దృక్పథంతో పాటు ఆధ్యాత్మిక శక్తి, సాధువుల ఆశీస్సులు, సాంస్కృతిక వారసత్వం కూడా తోడయ్యాయి" అని ఆయన అన్నారు. 2025 జులైలో వారణాసిలో జరిగిన యూత్ స్పిరిచ్యువల్ సమ్మిట్‌లో దేశంలోని 125 ఆధ్యాత్మిక సంస్థలు ఐదేళ్ల రోడ్‌మ్యాప్‌తో 'కాశీ డిక్లరేషన్'ను ఆమోదించాయని, వారంతా లక్షలాది పౌరులకు సేవ చేస్తున్నారని మోదీ వివరించారు. యువతను దేశానికి 'అమృత తరం' (అమృత్ పీఢి)గా అభివర్ణించిన ప్రధాని.. "రాబోయే 20-25 ఏళ్లలో మీ జీవితాలకు మీరే దిశానిర్దేశం చేసుకుంటారు. 2047 నాటికి వికసిత భారత్ సంకల్పాన్ని సాకారం చేసేది మీరే. ఆ విజయాన్ని సంపూర్ణంగా ఆస్వాదించేది కూడా మీరే. దేశానికి మీ శక్తి, సృజనాత్మకత, ప్రతిభ ఎంతో అవసరం. కాబట్టి దేశం కోసం, మీ సొంత జీవితాల కోసం డ్రగ్స్‌కు దూరంగా ఉండండి" అని పిలుపునిచ్చారు.

ఈ ప్రచారంలో భాగంగా ప్రతి ఆదివారం దేశవ్యాప్తంగా క్రీడా కార్యక్రమాలు, వాకథాన్‌లు, ధ్యాన శిబిరాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. 'మాదకద్రవ్యాలకు దూరంగా ఉండే యువతే వికసిత భారత్‌కు అసలైన బలం' అనే సందేశాన్ని దేశంలోని ప్రతి యువకుడికి చేర్చడమే ఈ ఉద్యమ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

# యుద్ధానికి బ్రేక్..

**మొదటిపేజీ తరువాయి**

సంబంధించిన పరిమితులపై అంగీకారం కుదిరిందని ఆయన తెలిపారు. అయితే, ఈ ఒప్పందం వేగంగా ఖరారైతేనే దాడుల విరమణ కొనసాగుతుందని స్పష్టం చేశారు. 'ట్రూత్ సోషల్' వేదికగా ట్రంప్ ఈ వివరాలు పంచుకున్నారు. త్వరలో కుదరబోయే ఒప్పందం ప్రకారం.. హర్మూజ్ జలసంధిని తక్షణమే, సంపూర్ణంగా తెరవడంతో పాటు, ఇరాన్ అణు ముప్పునకు ముగింపు పలకాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. "ఒప్పందం పరిమితులపై అంగీకారం కుదిరినందున, ఎటువంటి దాడికి పాల్పడవద్దని ఇరాన్, ఇతర పశ్చిమాసియా దేశాలు మమ్మల్ని కోరాయి. ఈ విజ్ఞప్తి ఆధారంగా, ప్రపంచ ప్రయోజనాల దృష్ట్యా దాడిని రద్దు చేసేందుకు అంగీకరించాను" అని ట్రంప్ తన పోస్ట్‌లో రాశారు. గత ఐదు నెలలుగా కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలికే ఈ ఒప్పందం పూర్తి చేసే ప్రయత్నంలో అమెరికాతో చేతులు కలిపేందుకు ఇజ్రాయెల్ కూడా అంగీకరించిందని ట్రంప్ పేర్కొన్నారు. అయితే, ఈ అంశంపై ఇజ్రాయెల్ నుంచి తక్షణమే ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

మరోవైపు, అమెరికా ఎలాంటి సాహసోపేత చర్యలకు పాల్పడవద్దని టెహ్రాన్ ఈ వారాంతంలో తీవ్రంగా హెచ్చరించింది. ఇరాన్ లక్ష్యాలపై కొత్త దాడులు చేస్తామన్న ట్రంప్ బెదిరింపులను నిజం చేస్తే, నిర్ణయాత్మకంగా ప్రతీకారం తీర్చుకుంటామని స్పష్టం చేసింది. శనివారం టర్కీ, పాకిస్థాన్, సౌదీ అరేబియా ఉన్నతాధికారులతో ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ వేర్వేరుగా ఫోన్‌లో మాట్లాడారు. అమెరికా 'అస్థిరపరిచే చర్యల' వల్ల కలిగే పరిణామాల గురించి ఆయన చర్చించారు. ఏదైనా దురాక్రమణకు పాల్పడితే గట్టిగా బదులిస్తామని స్పష్టం చేశారు. ఇదే సమయంలో, తమ దేశంలోని పలు కీలక కేంద్రాలపై ఇరాన్ ప్రయోగించిన డ్రోన్లను ధ్వంసం చేసినట్లు కువైట్ సైన్యం ప్రకటించింది.

# లష్కర్ బోనాల్లో సీఎం రేవంత్ రెడ్డి..

**మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు**

**హైదరాబాద్ ఆగష్టు 2, (రిపబ్లిక్ న్యూస్):**



సికింద్రాబాద్‌లోని శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర అంగరంగ వైభవంగా, భక్తిశ్రద్ధలతో కొనసాగుతోంది. ఈ ఉత్సవాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆయన జగన్మాతకు బోనం, పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లష్కర్ బోనాల జాతరలో భాగంగా ఆలయానికి విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన గర్భగుడిలో మహంకాళి అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. తెలంగాణ ప్రజలు సుఖసంతోషాలతో, పాడిపంటలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీతక్క, కాంగ్రెస్ ఎమ్మెల్యే దానం నాగేందర్, బీఆర్ఎస్ శాసనసభ్యుడు తలసాని శ్రీనివాస్ యాదవ్ కూడా పాల్గొన్నారు. వారు కూడా అమ్మవారికి పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వీరితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా ఈ వేడుకల్లో పాలుపంచుకున్నారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఆలయ పరిసరాల్లో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# రాష్ట్రాలకు ఫండింగ్

**మొదటిపేజీ తరువాయి**

మౌలిక సదుపాయాల కల్పన, రోడ్లు, ప్రాజెక్టులు వంటి 'క్యాపిటల్ ఎక్స్ పెండిచర్' పనులను వేగవంతం చేయడానికే ఈ ముందస్తుపంపిణీ చేపట్టినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. చేతిలో సరిపడా నిధులు ఉంటే రాష్ట్రాలు అభివృద్ధి పనుల్లో మరింత అగ్రెసివ్గా ముందుకెళ్తాయని కేంద్రం భావిస్తోంది.

**యూపీకి అత్యధిక నిధులు!**

కేంద్రం విడుదల చేసిన మొత్తంలో జనాభా, ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం అత్యధిక లబ్ధి పొందిన రాష్ట్రంగా ఉత్తరప్రదేశ్ నిలిచింది. యూపీకి అత్యధికంగా 3 19,208 కోట్లు దక్కాయి. ఆ తర్వాత స్థానాల్లో బిహార్కు 10,845 కోట్లు, మధ్యప్రదేశ్ ప్రభుత్వానికి 78,010 కోట్లు కేటాయించారు. అలాగే పశ్చిమ బెంగాల్ కు 37,866 కోట్లు, మహారాష్ట్రకు 37,022 కోట్లు లభించాయి. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు..

దక్షిణాది రాష్ట్రాలకు కేంద్ర నిధుల కేటాయింపు భారీగానే జరిగింది. ఆంధ్రప్రదేశ్కు 4,597 కోట్లు దక్కగా, తెలంగాణ రాష్ట్రానికి 2,370 కోట్లు కేటాయించారు. కర్ణాటకకు 4,504 కోట్లు, తమిళనాడుకు 4,466 కోట్లు అందాయి. రాజస్థాన్ ఖాతాలో 76,460 కోట్లు, ఒడిశాకు 4,819 కోట్లు జమయ్యాయి. చిన్న రాష్ట్రాల విషయానికొస్తే సిక్కింకు 7365 కోట్లు, గోవాకు 398 కోట్లు, నాగాలాండ్కు 3524 కోట్లు కేటాయించారు.

**ఏమిటీ ట్యాక్స్ డెవల్యూషన్ ?**

దేశంలో కేంద్ర ప్రభుత్వం సేకరించే వివిధ రకాల పన్నుల ద్వారా వచ్చే ఆదాయంలో ఒక నిర్దిష్ట శాతాన్ని రాష్ట్రాలకు పంచాల్సి ఉంటుంది. దీనినే ఆర్థిక భాషలో 'ట్యాక్స్ డెవల్యూషన్' అంటారు. ఫైనాన్స్ కమీషన్ నిర్దేశించిన ఫార్ములా ఆధారంగా ఏ రాష్ట్రానికి ఎంత ఇవ్వాలో లెక్కిస్తారు. రాష్ట్రాలు తమ సొంత బడ్జెట్ నిర్వహణకు, ప్రజారోగ్య, సంక్షేమ పథకాలను నిరంతరాయంగా అమలు చేయడానికి ఈ నిధులే ప్రాణాధారం. కాగా, ఆగస్టు 10న యథావిధిగా ఇచ్చే క్రమబద్ధమైన నెలవారీ పన్నుల వాటాను కేంద్రం వేరేగా విడుదల చేయనుంది. ఒకే నెలలో రెండుసార్లు నిధులు అందుతుండటంతో రాష్ట్రాల ఆర్థిక ఇబ్బందులు చాలావరకు తొలగిపోనున్నాయి.

# తక్కువ ధరకే బియ్యం..

**విజయవాడలో కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి నాదెండ్ల మనోహర్**

**విజయవాడఆగష్టు 2, (రిపబ్లిక్ న్యూస్):**




రాష్ట్రంలోని సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఊరట కల్పిస్తూ కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బహిరంగ మార్కెట్‌లో పెరుగుతున్న బియ్యం ధరలను నియంత్రించేందుకు, తక్కువ ధరకే నాణ్యమైన బియ్యాన్ని అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 130 రైతు బజార్లు, 500 రైస్ మిల్లుల వద్ద ప్రత్యేక కౌంటర్ల ద్వారా సబ్సిడీ బియ్యం విక్రయాలను ఆదివారం ప్రారంభించింది. విజయవాడలోని ఏపీఐఐసీ రైతు బజార్‌లో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించి, ప్రజలకు స్వయంగా బియ్యాన్ని అందజేశారు. ఈ పథకం కింద బీపీటీ సూపర్ ఫైన్ రకం బియ్యాన్ని కిలో రూ. 52కు, బీపీటీ రా రైస్‌ను కిలో రూ. 50కే విక్రయిస్తున్నారు. ఆధార్ కార్డు చూపించి ఒక వ్యక్తి 10 కిలోల వరకు బియ్యం కొనుగోలు చేయవచ్చు. బహిరంగ మార్కెట్‌లో రూ. 60 నుంచి రూ. 65 వరకు పలుకుతున్న ఈ రకం బియ్యాన్ని ప్రభుత్వం తక్కువ ధరకే అందుబాటులోకి తేవడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ, రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. "ప్రజలకు కష్టం రాకముందే వారిని ఆదుకునే ప్రభుత్వం మాది. మార్కెట్‌లో బియ్యం ధరలను సమీక్షించి, సామాన్యుడిపై భారం పడకుండా తక్కువ ధరకే బియ్యం అందించాలని నిర్ణయించాం. మా విజ్ఞప్తికి రైస్ మిల్లర్లు సానుకూలంగా స్పందించి సహకరించడం అభినందనీయం" అని తెలిపారు. భవిష్యత్తులో కందిపప్పు, పామాయిల్‌ను కూడా తక్కువ ధరలకు అందించేందుకు కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తున్నామని ఆయన వెల్లడించారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన రావు, పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ నూపుర్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, జనసేన నేత అమ్మిశెట్టి వాసు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ, ఆస్ట్రేలియా మధ్య 4 కీలక ఒప్పందాలు

యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్ కలిసి ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో 'సోలార్ తయారీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ఏర్పాటు చేయనున్నాయి. దీని ద్వారా ఏపీని సోలార్ తయారీ, పరిశోధన, ఆవిష్కరణలకు జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దడం లక్ష్యం. ఈ సెంటర్‌లో అధునాతన సోలార్ పీవీ తయారీ, ప్యానెళ్ల రీసైక్లింగ్, సర్క్యులర్ ఎకానమీ వంటి అంశాలపై పరిశోధనలు జరుగుతాయి. సోలార్ సెల్ ఫిజిక్స్, మాన్యుఫ్యాక్చరింగ్, వాఫరింగ్ టెక్నాలజీస్ వంటి అంశాలపై కరిక్యులమ్, శిక్షణా కార్యక్రమాలను ఖచ్చితా రూపొందించి సహకారం అందిస్తుంది.

**2. సమ్మిళిత విద్య బలోపేతం కోసం**

రెండో ఒప్పందం సమ్మిళిత విద్యపై దృష్టి సారించింది. యూఎన్ఎస్‌డబ్ల్యూ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, ఏపీ సమగ్ర శిక్ష సంయుక్తంగా ఈ ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఆటిజం, ఇతర న్యూరోడైవర్స్ విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు ఉపాధ్యాయుల సామర్థ్యాన్ని పెంచడం దీని ముఖ్య ఉద్దేశం. స్పెషల్ ఎడ్యుకేటర్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో పాటు, రాష్ట్ర విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా బోధనా వనరులను రూపొందిస్తారు.

**3. విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై పైలట్ ప్రాజెక్ట్**

మూడో ఒప్పందంలో భాగంగా ఏపీ ఉన్నత విద్యా మండలి, ఆస్ట్రేలియాకు చెందిన రీబౌండ్ డింపుల్ ప్రైవేట్ లిమిటెడ్ కలిసి రాష్ట్రంలోని ఎంపిక చేసిన విద్యాసంస్థల్లో పైలట్ ప్రాజెక్టు చేపట్టనున్నాయి. విద్యార్థుల మానసిక ఆరోగ్య పరిరక్షణే దీని లక్ష్యం. ప్రత్యేకంగా రూపొందించిన వేదిక ద్వారా విద్యార్థులు తమ గోప్యతకు భంగం కలగకుండా మానసిక ఆరోగ్య సలహాలు, వర్చువల్ కౌన్సెలింగ్ సేవలను పొందవచ్చు. ఈ పైలట్ ప్రాజెక్టును ఉచితంగా అమలు చేయనున్నారు.

**4. నైపుణ్యాభివృద్ధికి డీఎల్ఎస్‌తో భాగస్వామ్యం**

నాలుగో ఒప్పందం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆస్ట్రేలియాకు చెందిన డైనమిక్ లెర్నింగ్ సర్వీసెస్ ) మధ్య కుదిరింది. వృత్తి విద్య, నైపుణ్యాభివృద్ధి, అంతర్జాతీయ ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం కోసం ఇరు సంస్థలు కలిసి పనిచేస్తాయి. పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా శిక్షణా కార్యక్రమాలను రూపొందించి, ప్రొఫెషనల్ సర్టిఫికేషన్ అందించడం దీని ప్రధాన లక్ష్యం.

ఈ ఒప్పందాలకు ముందు ఆస్ట్రేలియా ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ అయింది. ఏపీలో ఉన్న అవకాశాలను సీఎం వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, ఐఐటీ తిరుపతి డైరెక్టర్ డా.సత్యనారాయణ్, చెన్నైలోని ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ సిలై జాకీ సహా పలువురు ఉన్నతాధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# దేశంలో రుతుపవనాలవింత పోకడ..

**ఒకచోట కుండపోత, మరోచోట ఉక్కపోత!**

**హైదరాబాద్ ఆగష్టు 2, (రిపబ్లిక్ న్యూస్):**

దేశంలో నైరుతి రుతుపవనాలు విస్తరించినప్పటికీ, వాటి గమనం అసమానంగా, బలహీనంగా కొనసాగుతోంది. ఒకవైపు కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండగా, మరోవైపు అనేక ప్రాంతాలు వర్షాల కోసం ఎదురుచూస్తున్నాయి. ఇప్పటికీ పలు ప్రాంతాల్లో వేడిమితో ఉక్కపోత పరిస్థితులు నెలకొన్నాయి. జాతీయ స్థాయిలో ఇప్పటివరకు 11 శాతం వర్షపాత లోటు నమోదైంది. ఈ పరిస్థితిని భారత వాతావరణ శాఖ (ఐఎండీ), ఇస్రో సంయుక్తంగా పంపిన ఇన్శాట్-3డీఎస్ ఉపగ్రహ చిత్రాలు స్పష్టంగా కళ్లకు కడుతున్నాయి. వాతావరణ శాఖ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, జూన్ 4 నుంచి ఇప్పటివరకు దేశంలో 446.3 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతానికి బదులుగా కేవలం 395.5 మిల్లీమీటర్ల వర్షపాతమే నమోదైంది. ఉపగ్రహ చిత్రాల్లో పశ్చిమ, మధ్య భారతదేశంపై దట్టమైన మేఘాలు ఆవరించి ఉండగా, గంగా-సింధు మైదాన ప్రాంతాలైన ఢిల్లీ, హర్యానా, పంజాబ్, ఉత్తరప్రదేశ్‌లోని చాలా ప్రాంతాల్లో ఆకాశం నిర్మలంగా కనిపిస్తోంది. ప్రస్తుతం గుజరాత్, దాని పరిసర ప్రాంతాల్లో క్రియాశీలంగా ఉన్న వాతావరణ వ్యవస్థ కారణంగా అక్కడ విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీనికి విరుద్ధంగా, వాయువ్య భారతదేశంలో రుతుపవనాల కదలికలు బలహీనంగా ఉన్నాయి. అయితే, రుతుపవన ద్రోణి ఉత్తరం వైపు కదిలే అవకాశం ఉండటంతో రాబోయే రోజుల్లో ఉత్తరాది రాష్ట్రాల్లో పరిస్థితి మెరుగుపడొచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఆదివారం (ఆగస్టు 2) నుంచి ఢిల్లీ, హర్యానా, పంజాబ్, యూపీల్లో తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉంది. ఆగస్టు 3 నుంచి 5 మధ్య వర్షాలు పుంజుకుని, 40 నుంచి 70 శాతం ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు (40-100 మి.మీ.) కురవొచ్చని తెలిపింది. మరోవైపు, దక్షిణ, మధ్య రాజస్థాన్‌లో ఆది, సోమవారాల్లో భారీ వర్షాలు పడే సూచనలు ఉన్నాయి. మొత్తం మీద, కొన్ని పశ్చిమ ప్రాంతాలు వరదలతో సతమతమవుతుండగా, ఉత్తరాది ప్రాంతాలు విస్తారమైన వర్షాల కోసం ఇంకా ఎదురుచూస్తున్నాయి.

# వైసీపీ ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్ట్..

**ఆలూరు**

కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. టీడీపీ కార్యకర్తలపై దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలపై అధికార వైసీపీకి చెందిన స్థానిక ఎమ్మెల్యే బి. విరూపాక్షిని, ఆయన కుమారుడు చంద్రశేఖర్‌ను పోలీసులు శనివారం అర్ధరాత్రి అరెస్ట్ చేశారు. ఆయనతో పాటు మరో 13 మందిని కూడా అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారందరినీ ఆదివారం ఆలూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఎదుట హాజరుపరిచారు.

## అసలేం జరిగింది?

చిప్పగిరి మండలం సంగాల గ్రామంలో శనివారం రాత్రి టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘటనలో దాడులు, దౌర్జన్యాలు జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తాయి. టీడీపీ కార్యకర్త శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు రంగంలోకి దిగారు. ఎమ్మెల్యే విరూపాక్షితో సహా మొత్తం 15 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పోలీసుల కథనం ప్రకారం..

వైసీపీ నేత గిరి, టీడీపీ నేతలైన గురునాథ్, శివ, నాగరాజు మధ్య మొదలైన వాగ్వాదం ఘర్షణకు దారితీసింది. గిరి ఫోన్ చేయడంతో ఎమ్మెల్యే విరూపాక్షి సుమారు 10 కార్ల కాన్వాయ్‌తో గ్రామానికి చేరుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే సమక్షంలోనే ఆయన అనుచరులు టీడీపీ నేత నాగరాజు ఇంట్లోకి చొరబడి దాడికి పాల్పడ్డారు. అడ్డుకోబోయిన మహిళ సుచిత్రపై కూడా చేయి చేసుకున్నారని, మరో నేత కొండా పురుషోత్తం కారును ధ్వంసం చేశారని పోలీసులు తెలిపారు. దళిత వ్యక్తి ఇంటిపై దాడి చేసి, ఆయన భార్యపై చేయి చేసుకున్న ఘటన కావడంతోనే ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు వివరించారు.

## అక్రమ అరెస్ట్ అంటున్న వైసీపీ

అయితే, ఈ అరెస్టును వైసీపీ నేతలు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఇది కక్షపూరితమైన, అక్రమ అరెస్ట్ అని ఆరోపించారు. తమ పార్టీ నేత గిరి ఇంటిపై టీడీపీ నాయకులే మొదట దాడికి ప్రయత్నించగా, ఎమ్మెల్యే విరూపాక్షి అక్కడికి విచారణకు వెళ్లారని తెలిపారు. ఆ సమయంలో టీడీపీ కార్యకర్తలు రాళ్లు రువ్వడంతో ఎమ్మెల్యే సోదరుడు శ్రీరామకు గాయాలయ్యాయని చెప్పారు. తాము ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు, అర్ధరాత్రి ఎమ్మెల్యేను, ఆయన కుమారుడిని అక్రమంగా అరెస్ట్ చేశారని ఆరోపించారు. ఎమ్మెల్యే ఇంటిలోని సీసీటీవీ హార్డ్ డిస్క్‌లను కూడా పోలీసులు తీసుకెళ్లారని వారు పేర్కొన్నారు.

## ఫ్యాక్ట్ చెక్ తో బదులిచ్చిన ఏపీ ప్రభుత్వం

ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అక్రమ అరెస్టు అంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా అసత్యం అని ఏపీ ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పష్టం చేసింది. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ ప్రకటన విడుదల చేసింది. "ఎస్సీ వర్గానికి చెందిన ఒక వ్యక్తి ఇంటిపై దాడి చేసి అతని భార్య పై దౌర్జన్యం చేసి ఆమె వస్త్రాలు చించిన కేసులో ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టు అయ్యారు. వాస్తవం ఏమిటంటే.. ఆలూరు నియోజకవర్గం, చిప్పగిరి మండలం సంగాల గ్రామంలో ఒక పార్టీ నాయకుడు గిరి (యాదవ్), మరొక పార్టీ నాయకులైన గురునాథ్ (యాదవ్), శివ, నాగరాజు (ఎస్సీ మాదిగ) లను అసభ్య పదజాలంతో మాట్లాడారు. ఎందుకు అలా మాట్లాడావని నాగరాజు ప్రశ్నించినందుకు గిరి ఎమ్మెల్యే విరూపాక్షికి ఫోన్ చేయగా, ఆయన తన అనుచరులతో కలిసి సుమారు 10 కార్లలో అక్కడకు చేరుకున్నారు. వారు నాగరాజు ఇంటిలోకి దౌర్జన్యంగా చొరబడి, ఎమ్మెల్యే సమక్షంలోనే ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేశారు. ఈ దాడిని అడ్డుకోవడానికి ప్రయత్నించిన నాగరాజు భార్య సుచిత్రపై చేయిచేసుకుని ఆమె నైటీని చింపేశారు. అలాగే వారిని వారించబోయిన రాజశేఖర్, నాగరాజు అన్నపై కూడా విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ విషయం తెలుసుకుని పరామర్శించడానికి వచ్చిన స్థానిక నాయకుడు కొండా పురుషోత్తం కారును ధ్వంసం చేశారు. ఈ ఘటనలో గాయపడిన బాధితులను చికిత్స నిమిత్తం ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. జరిగింది ఇది కాగా అక్రమంగా పోలీసులు అరెస్టు చేసినట్లు ప్రచారం చేయడం సబబు కాదు" అని ఏపీ ఫ్యాక్ట్ చెక్ వివరించింది. కాగా, ఈ అరెస్టులతో ఆలూరు నియోజకవర్గంలో అధికార టీడీపీ, ప్రతిపక్ష వైసీపీ మధ్య రాజకీయ ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారు.

## ప్రజలు ఎన్నుకున్న విరూపాక్షి ఏమైనా ఉగ్రవాదా?: జగన్



రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని, 'నారాసుర పాలన'లో అరాచకం పరాకాష్ఠకు చేరిందని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దాడి చేసిన అధికార పార్టీ వారికి రక్షణ కల్పిస్తూ, బాధితులైన ప్రతిపక్ష నేతలపైనే హత్యాయత్నం వంటి తీవ్రమైన కేసులు బనాయిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఇది ప్రజాస్వామ్యమా, పోలీస్ రాజ్యమా లేక జంగిల్ రాజ్యమా అని ముఖ్యమంత్రి చంద్రబాబును ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు.

ప్రజా రిపబ్లిక్



## క్రికెట్ పోటీలో రెవెన్యూ శాఖ విజయం

## అత్యధిక స్కోర్ సాధించిన జాయింట్ కలెక్టర్

### 138 పరుగుల తో రెవెన్యూ జట్టు ఆర్జీఎం జట్టు పై విజయం



**పాణ్యం, ప్రతినిధి ఆగస్టు, 2 (ప్రజా రిపబ్లిక్ న్యూస్).** ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ నంద్యాల జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలో రెవెన్యూ శాఖ 138 పరుగుల తేడాతో ఆర్ జి యం జట్టుపై విజయం సాధించినట్లు జిల్లా అధ్యక్షుడు కామేశ్వర్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆర్ జి యం ఇంజనీరింగ్ కళాశాలలో రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెవెన్యూ శాఖ, ఆర్జీఎం జట్ల మధ్య క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో 20 ఓవర్లలో ఆరు వికెట్లకు138 పరుగులు చేసి ఐదు పరుగుల తేడాతో ఆర్ జి యం జట్టుపై రెవెన్యూ జట్టు విజయం సాధించారన్నారు. ఈ పోటీలో జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ ఘనోరి అత్యధికంగా 41 పరుగులు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల ఆర్డీవో చెల్లా విశ్వనాథ్, ఆంధ్ర ప్రదేశ్ రెవిన్యూ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షులు కామేశ్వర రెడ్డి కార్యదర్శి రామచంద్ర రావు, వాడిని తహసిల్దారు ప్రవీణ్ కుమార్, నంద్యాల అర్బన్ తహసిల్దారు శ్రీనివాసులు, పిడి వెంకటేష్, రెవెన్యూ, ఆర్ జి యం కళాశాల సిబ్బంది పాల్గొన్నారు..

# ఉత్తమ ఫలితాలు రావుస్ సొంతం

### : సిఈఓ తిరుమల రెడ్డి



**ఎమ్మిగనూరు, ఆగష్టు, 2,(ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**

పరీక్షలు ఏవైనా ఉత్తమ ఫలితాలు సాధించడంలో రావుస్ డిగ్రీ కళాశాల ఎప్పుడూ ముందుంటుందని కళాశాల సీఈఓ తిరుమల రెడ్డి, సీఓఓ సుజనా రెడ్డి తెలిపారు. ఇటీవల రాయలసీమ యూనివర్సిటీ విడుదల చేసిన నాలుగో సెమిస్టర్ హానర్స్ కోర్సు ఫలితాల్లో పట్టణంలోని రావుస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ఎమ్మిగనూరు టౌన్ టాపర్లుగా నిలిచారని వారు తెలిపారు.

**టాపర్ల వివరాలు:**

- బీఎస్సీ జువాలజీ హానర్స్: కే. హేమంత్ కుమార్ 9.13, ఎస్.ఎం. హర్షద్ 8.96, యు. మదీహ 8.84
- బీఎస్సీ కంప్యూటర్ హానర్స్: మహమ్మద్ ఒసేయ్ 9.07, ఎస్. నూర్జహాన్ బి 9.06
- బీఎస్సీ బోటనీ హానర్స్: వి. లోకేశ్వరి 8.53, బి. రాజశేఖర్ 8.28
- బీఎస్సీ (ఇతర): వై. కిరణ్ కుమార్ 8.77
- బీబీఏ హానర్స్: టి. అయిషా భాను 8.26, ఆర్.సి. నరసప్ప 8.20, బి. ఇందు 8.19
- బీఏ పొలిటికల్ సైన్స్ హానర్స్: కే. మహమ్మద్ హుస్సేన్ 8.24, కే. నాజియా 8.17, ఎస్. సమీన్ 7.91
- బీఏ హిస్టరీ హానర్స్: చాకలి ఇందు 7.74, బి. నందిని 7.56
- బీఏ స్పెషల్ తెలుగు హానర్స్: బి. జయశ్రీ 7.89, ఎస్. కల్పన 7.64, జి. నాగవేణి 7.43

ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల సీఈఓ తిరుమల రెడ్డి, సీఓఓ సుజనా రెడ్డి, అకాడమిక్ ఇన్‌చార్జ్ వీరేష్, ప్రిన్సిపల్ ఇర్ఫాన్‌తో పాటు సీనియర్ అధ్యాపకులు నరసింహులు, గోరంట్ల, నూరుల్లా, రాఘవేంద్ర, విజయరాజు, సంపత్ కుమార్, నాజీర్, ధనుంజయ, గోవిందు, సాయి అమృత, రజిత, సురేఖ, షకీలా బేగం ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు భవిష్యత్తులో కూడా ఇదే స్థాయి ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు.

# పద్మశ్రీ సాహిత్య పిపాసి

### దళిత సామాజిక కెరటం : ఆశావాది -కన్నుల పండుగగా "కళా" రత్న వేడుకలు





**అనంతపురం సాహిత్యం, ఆగస్టు 02,(రిపబ్లిక్ న్యూస్):**

ప్రముఖ సాహితీవేత్త, అవధానాచార్య, పద్మశ్రీ డాక్టర్ ఆశావాది ప్రకాశరావు 83వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశావాది సాహితీ కుటుంబ పురస్కారాల ప్రధానోత్సవం ఆదివారం అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల డ్రామా హాల్‌లో జరిగాయి. ఆశావాది సాహితీ కుటుంబం, పెనుకొండ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల హిందీ ఉపన్యాసకులు ఆశావాది శశాంక మౌళి అధ్యక్షత వహించగా, తిరుపతికి చెందిన శతావధాని, కళారత్న అముదాల మురళి సభను సమన్వయం చేశారు.

ముఖ్య అతిథిగా జనప్రియ కవి ఏలూరు యంగన్న, విశిష్ట అతిథిగా వైఎస్సార్ జీవన సాఫల్య పురస్కార గ్రహీత డాక్టర్ శాంతి నారాయణ, ఆత్మీయ అతిథిగా ప్రముఖ గాయకుడు ముండ్లపాటి వెంకట సుబ్బయ్య,



గౌరవ అతిథిగా శిల్పి, కళారత్న డాక్టర్ గొల్లపల్లి జయన్న పాల్గొన్నారు.

**ఆశావాది ప్రకాశరావు సాహితీ పీఠం లోగో ఆవిష్కరణ**

పురస్కార గ్రహీతల పరిచయాన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంస్కృత ఉపన్యాసకులు డాక్టర్ ఆశావాది సుధామ వంశి చేశారు. ఈ సందర్భంగా సాహిత్య పురస్కారాన్ని అన్నమరాజు ప్రభాకర్ రావుకు, అవధాన పురస్కారాన్ని నల్లాన్ చక్రవర్తుల సాహిత్‌కు, సామాజిక సేవా పురస్కారాన్ని డాక్టర్ వై.కె. విశ్వనాథ్ మాదిగకు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా డాక్టర్ వై.కె. విశ్వనాథ్ మాదిగ చేతుల మీదుగా 'అవధానాచార్య పద్మశ్రీ డాక్టర్ ఆశావాది ప్రకాశరావు సాహితీ పీఠం' లోగోను ఆవిష్కరించారు.

**ఆయన సాహిత్యం భావితరాలకు స్ఫూర్తి**

ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ డాక్టర్ ఆశావాది ప్రకాశరావు తెలుగు పద్యం, అవధాన రంగాలకు విశిష్ట సేవలు అందించిన మహోన్నత సాహితీవేత్త అని కొనియాడారు. తెలుగు భాష, సాహిత్యం ఉన్నంతకాలం ఆయన సాహిత్యం చిరస్థాయిగా నిలిచి, భావితరాలకు స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. వేడుకలకు సాహితీప్రియులు, కళాకారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. నిర్వాహకులు ఆశావాది శిరీష వాణి, ఆశావాది వసంత గౌరి, ఆశావాది నవీన, ఆశావాది శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

## రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న కర్నూలు పోలీసులు

### నేర ప్రవృత్తికి స్వస్తి పలికి సత్ప్రవర్తనతో జీవించాలి

### -చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హెచ్చరిక






**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 2)**జిల్లా వ్యాప్తంగా నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రౌడీ షీటర్లు, నేర చరిత్ర కలిగిన వ్యక్తులు, చెడు నడత కలిగిన వారికి కర్నూలు పోలీసులు ప్రత్యేక కౌన్సిలింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు రౌడీ షీటర్లకు సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి పూర్తిగా స్వస్తి పలకాలని సూచించారు. అలాగే చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా జీవించాలని అవగాహన కల్పించారు. నేరాలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేస్తూ హెచ్చరించారు. సమాజంలో శాంతి భద్రతలు నెలకొల్పడం, నేరాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవడం లక్ష్యంగా ఇటువంటి కౌన్సిలింగ్ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు.

# యువ క్రీడాకారుల అభివృద్ధికి

## ఎమ్మెల్యే జయరాం భరోసా

**గుత్తి, ఆగస్టు 2: (రిపబ్లిక్ న్యూస్)**



గుత్తి సాయి స్పోర్ట్స్ యూనిట్ తైక్వాండో అకాడమీ అభివృద్ధికి గుంతకల్లు నియోజకవర్గ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం చేయూత అందించారు. ఆలూరు పట్టణంలోని తన స్వగృహంలో ఎమ్మెల్యేను అకాడమీ ప్రధాన కోచ్ సి. సాయి తేజా, క్రీడాకారులు, తల్లిదండ్రులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తైక్వాండో శిక్షణకు అవసరమైన పరికరాల కొనుగోలు కోసం ఎమ్మెల్యే రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా అకాడమీ ప్రధాన కోచ్ సి. సాయి తేజా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఎమ్మెల్యే అందించిన ఆర్థిక సహాయం ఎంతో విలువైనదని అన్నారు. ఈ నిధులతో ఆధునిక తైక్వాండో శిక్షణ పరికరాలను కొనుగోలు చేసి విద్యార్థులకు మెరుగైన శిక్షణ అందిస్తామని తెలిపారు. అకాడమీ విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించేలా నిరంతరం శిక్షణ ఇస్తున్నామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల పెంపొందుతాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. యువత క్రీడల వైపు అడుగులు వేసేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. సాయి స్పోర్ట్స్ యూనిట్ తైక్వాండో అకాడమీ చేస్తున్న కృషిని ఎమ్మెల్యే అభినందించారు. ఎమ్మెల్యే అందించిన ఆర్థిక సహాయంతో అకాడమీ విద్యార్థులకు మరింత మెరుగైన శిక్షణ అందించేందుకు అవకాశం ఏర్పడిందని కోచ్ సి. సాయి తేజా తెలిపారు. ఈ సందర్భంగా అకాడమీ తరఫున క్రీడాకారులు, తల్లిదండ్రులు, కోచ్ సి. సాయి తేజా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఎమ్మెల్యే వీరుపాక్షి అరెస్టు ప్రజాస్వామ్యంపై దాడి

### --మాజీ ఎంపీ బుట్టా రేణుక -చిప్పగిరి పోలీస్ స్టేషన్‌లో ఎమ్మెల్యేను పరామర్శ -నిరసన ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎంపీ











**ఎమ్మిగనూరు, ఆగష్టు, 2,(ప్రజా రిపబ్లిక్ న్యూస్**

)ఆలూరు ఎమ్మెల్యే బుసినె వీరుపాక్షిపై నమోదు చేసిన కేసులు, ఆయన అరెస్టు పూర్తిగా రాజకీయ కక్షసాధింపులో భాగమేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు పార్లమెంట్ సమన్వయకర్త, మాజీ ఎంపీ బుట్టా రేణుక ఆరోపించారు. ఆదివారం చిప్పగిరి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న ఆమె, అరెస్టులో ఉన్న ఎమ్మెల్యే బుసినె వీరుపాక్షిని పరామర్శించి సంగాల గ్రామంలో జరిగిన ఘటనతో పాటు అనంతర పరిణామాలపై వివరాలు తెలుసుకున్నారు.

అనంతరం కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి చిప్పగిరి పోలీస్ స్టేషన్ నుంచి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. కూటమి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బుట్టా రేణుక మాట్లాడుతూ, సంగాల గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడి జరిగినప్పటికీ అసలు నిందితులపై చర్యలు తీసుకోకుండా బాధితులపైనే కేసులు నమోదు చేయడం దుర్మార్గమని విమర్శించారు. ఎమ్మెల్యే బుసినె వీరుపాక్షిని రాజకీయంగా వేధించాలనే ఉద్దేశంతో ఆధారాలు లేని కేసులు నమోదు చేసి, తెల్లవారుజామున నివాసంలోకి వెళ్లి అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆరోపించారు.

ప్రజల కోసం పోరాడుతున్న ప్రతిపక్ష నాయకులను అక్రమ కేసులు, అరెస్టులతో భయపెట్టాలని ప్రభుత్వం ప్రయత్నిస్తున్నప్పటికీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వెనక్కి తగ్గదని ఆమె స్పష్టం చేశారు. ఎమ్మెల్యే బుసినె వీరుపాక్షితో పాటు అరెస్టు చేసిన వారందరినీ బేషరతుగా విడుదల చేయాలని, సంగాల ఘటనలో దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం బుట్టా రేణుక ఆలూరు ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి ఆయన సతీమణి రామాంజనమ్మతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి సంఘీభావం తెలిపారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ అధైర్యపడవద్దని, పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అలాగే పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజా సమస్యలపై పోరాటాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి, మాజీ మంత్రి శైలజానాథ్, మాజీ ఎమ్మెల్యేలు వై. సాయిప్రసాద్ రెడ్డి, శ్రీదేవి, ఎమ్మెల్సీలు మధుసూదన్, ఇషాక్, మంగమ్మ, కోడుమూరు సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, ఎమ్మిగనూరు ఇన్‌చార్జి ఎర్రకోట రాజీవ్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి బీవై రామయ్య, రాష్ట్ర కార్యదర్శి సుభాష్ చంద్రబోస్, జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్ రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కనకవీడులో బోరు మోటార్ల కాపర్ వైర్లు దొంగతనం

### రూ.1.50 లక్షల ఆస్తి నష్టం - దొంగలను పట్టుకోవాలని రైతు విజ్ఞప్తి





**ఎమ్మిగనూరు, ఆగష్టు, 2 ,(ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**

నందవరం మండలం కనకవీడు గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు బోరు మోటార్లకు సంబంధించిన కాపర్ వైర్లను దొంగతనం చేసిన ఘటన రైతుల్లో ఆందోళన కలిగించింది. ఈ ఘటనలో సుమారు రూ.1.50 లక్షల విలువైన కాపర్ వైర్లు చోరీకి గురైనట్లు బాధిత రైతులు తెలిపారు. రైతుల కథనం ప్రకారం, శనివారం అర్ధరాత్రి సమయంలో ఈ దొంగతనం జరిగినట్లు గుర్తించారు. గ్రామానికి చెందిన బోయ బ్రహ్మయ్య, కనిగిరి యామన్న, మీనిగా దుబ్బన్న, గిరిని పరమేష్, కురువ హంపయ్య, విరూపాక్షి, కుమ్మరి వీరశేఖర్, కుమ్మరి నరసింహులు, దస్తగిరిలకు చెందిన రెండు బోరు మోటర్ల కాపర్ వైర్లు, అలాగే బోయ గోపాల్, గోవిందు, బోయ భీమన్న, గజ్జల పెద్దయ్యలకు చెందిన ఒక్కో బోరు మోటర్ కాపర్ వైర్లను దుండగులు అపహరించినట్లు తెలిపారు. ఈ దొంగతనం వల్ల రైతులకు భారీ ఆర్థిక నష్టం వాటిల్లిందని, వెంటనే పోలీసు శాఖ దర్యాప్తు చేపట్టి దొంగలను గుర్తించి అరెస్టు చేయడంతో పాటు బాధితులకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రైతులు తెలిపారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

# వేణుగోపాల్ మృతి పార్టీకి తీరని లోటు

**మాజీ సర్పంచ్ కే. సుబ్రహ్మణ్యం -కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేత**








**రామకుప్పం క్రైమ్, ఆగస్టు 02, (రిపబ్లిక్ న్యూస్):** వైయస్సార్ పార్టీ సీనియర్ నాయకులు వేణుగోపాల్ మృతి పార్టీకి తీరని లోటు అని మాజీ సర్పంచ్ కే. సుబ్రహ్మణ్యంపేర్కొన్నారు. ఆదివారం రామకుప్పం మండలం కించనమల పంచాయతీ పరిధిలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ సీనియర్ నాయకుడు వేణుగోపాల్ అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతితో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.

**బాధిత కుటుంబానికి అండగా ఉంటాం**

విషయం తెలుసుకున్న కించనమల పంచాయతీ ప్రజాప్రతినిధులు, వైఎస్సార్సీపీ నాయకులు వేణుగోపాల్ నివాసానికి చేరుకుని ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబానికి తక్షణ సహాయంగా రూ.5 వేల నగదు అందజేసి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కే. సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ చలపతి, కో-ఆప్షన్ సభ్యుడు, మైనార్టీ కన్వీనర్ బర్కతుల, కోటచేను మంజునాథ్ రెడ్డి, ఆర్.కే. పలని, వెంకటాచలం, దామోదర్, మాజీ గ్రామ పెద్ద ధనపాల్, శ్రీనివాసులు, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువత విభాగం కార్యదర్శిగా థామస్ విజయ్





**రామకుప్పం 2 ఆగస్టు రిపబ్లిక్ న్యూస్**

రామకుప్పం మండలం బల్ల పంచాయతీ బల్ల గ్రామనివాసి థామస్ విజయ్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువత విభాగం కార్యదర్శిగా నియమించిన మాజీ ముఖ్యమంత్రివర్యులు జగన్మోహన్ రెడ్డి రీజినల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డి ఉమ్మడి చిత్తూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కరుణాకర్ రెడ్డి ఎమ్మెల్సీ, కుప్పం నియోజకవర్గ వైకాపా ఇన్చార్జి వర్యులు శ్రీ కే ఆర్ జే భరత్ వైసిపి లీడర్లు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు

# సేవా కార్యక్రమాల విస్తరణకు కృషి

**లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 316 జిల్లా గవర్నర్‌గా విరూపాక్షరెడ్డి**





**గుత్తి, ఆగస్టు 2: (రిపబ్లిక్ న్యూస్ )** సమాజ సేవే లక్ష్యంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 316 జిల్లా గవర్నర్‌గా ఎంపికైన విరూపాక్షరెడ్డి తెలిపారు. గుత్తి పట్టణంలోని విరుపాక్షి రెడ్డి ఫంక్షన్ హాల్లో ఆదివారం లయన్స్ క్లబ్ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గవర్నర్‌గా ఎంపికైన విరూపాక్షరెడ్డిని క్లబ్ ప్రతినిధులు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా విరూపాక్షరెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు. క్లబ్ సభ్యుల సహకారంతో సంస్థను మరింత బలోపేతం చేసి, ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపడతామని తెలిపారు. సమాజంలో అవసరమైన వారికి అండగా నిలవడంతో పాటు పేదలు, విద్యార్థులు, వృద్ధులు, దివ్యాంగులకు సహాయపడే కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. ప్రజా సంక్షేమానికి ఉపయోగపడే విధంగా వైద్య సేవలు, విద్యా సహాయం, రక్తదాన శిబిరాలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ తదితర కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు. లయన్స్ క్లబ్ ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలను మరింత విస్తరించి జిల్లాలో సంస్థకు మరింత గుర్తింపు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు. క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ ఎప్పటినుంచో ముందుంటోందని తెలిపారు. విరూపాక్షరెడ్డి జిల్లా గవర్నర్‌గా ఎంపిక కావడం గుత్తి లయన్స్ క్లబ్‌కు గర్వకారణమన్నారు. ఆయన నాయకత్వంలో క్లబ్ మరింత అభివృద్ధి చెంది, ప్రజలకు విస్తృతంగా సేవలు అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

అనంతరం విరూపాక్షరెడ్డిని క్లబ్ సభ్యులు, ప్రతినిధులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, ప్రతినిధులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# బాలికను చితకబాదిన ప్రైవేటు టీచర్

**పోలీసులను ఆశ్రయించిన బాలిక తల్లిదండ్రులు**

**కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ**



**బండి ఆత్మకూరు, ఆగస్టు 2, ( రిపబ్లిక్ న్యూస్): -** బండి ఆత్మకూరు మండల పరిధిలోనీ ఈర్నపాడు గ్రామంలో ఉన్న ప్రవేట్ స్కూల్లో రెండో తరగతి చిన్నారి దీవెనను ఉపాధ్యాయురాలు చితక బాదిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. బాలిక తల్లిదండ్రులు కొండయ్య, నందిని దంపతుల కుమార్తె స్థానిక ప్రవేట్ స్కూల్లో దీవెన రెండో తరగతి చదువుతోంది. అయితే ఆ చిన్నారి చేసిన తప్పు ఏంటో తెలియదు కానీ అక్కడ పనిచేసే ఉపాధ్యాయురాలు బాలికను వీపు వాచేలా చితకబాదింది. దీంతో బాలికకు వీపుమీద తీవ్రమైన గాయాలయ్యాయి. వీపు భాగంలో నాలుగైదు చోట్ల పైచర్మం లేచి తీవ్రమైన గాయాలయ్యాయి. శనివారం జరిగిన ఈ దాడి ఘటనను భయంతో ఆ తల్లిదండ్రులకు చెప్పలేదన్నారు. ఆదివారం సాయంత్రం తల్లి ఆచిన్నారికి స్నానం చేయించే క్రమంలో ఆ చిన్నారి వంటి పై ఉన్న గాయాలు చూసి తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. దీంతో చిన్నారి సదరు ఉపాధ్యాయురాలని ప్రశ్నించారు. అయితే ఆమె వారిపైనే ఎదురుదాడికి దిగిందని బాధితులు పోలీసులను ఆశ్రయించారు. జరిగిన సంఘటన గురించి, చెప్పాల్సిన టీచర్ బాలిక నానమ్మ అయినటువంటి నాగమ్మపై ఎదురుగాడికి దిగింది. దీంతో నాగమ్మ తలకు కూడా రక్త గాయమైంది. ఈ విషయంపై దీవెన తల్లిదండ్రులు ఆదివారం రాత్రి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లుగా సమాచారం. ఇదిలా ఉండగా కొరవడిన ఉన్నత విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే ఈ విధమైన దాడులు జరుగుతున్నట్లు పలువురు విద్యావేత్తలు ఆరోపిస్తున్నారు. నేటికీ ప్రైవేట్ స్కూళ్లలో నిబంధనలకు లోబడి పాఠశాలల నిర్వహణ జరగడం లేదనేది ప్రధాన ఆరోపణ. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఇలాంటి పాఠశాలలపై తనిఖీలు చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. దీవెనపై జరిగిన దాడి పట్ల ఈర్ణ పాడు గ్రామంలో ఆందోళనలు వ్యక్తం చర్చనీయాంశంగా మారింది.

# ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి అరెస్ట్

**అరెస్టుపై మండిపడ్డ వైసిపి నాయకులు**









**చిప్పగిరి, ఆగస్టు, 2,( రిపబ్లిక్ న్యూస్)** ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి అరెస్ట్ కావడంతో వైసిపి నాయకులు మండిపడ్డారు శనివారం చిప్పగిరి మండలం నేమకల్ సంగాల గ్రామంలో వైసిపి నాయకుడు గిరి పై టిడిపి నాయకులు గురునాథ తో పాటు మరో ఇద్దరు దాడి చేశారని ఆరోపించారు, విషయం తెలుసుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే బుసినే విరుపాక్షిని అక్కడికి చేరుకోవడంతో కొంతసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది వెంటనే సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టారు. శనివారం అర్ధరాత్రి పోలీసులు ఎమ్మెల్యే విరుపాక్షి ని అరెస్టు చేసిన నేపథ్యంలో మరోసారి చిప్పగిరి మండల కేంద్రంలో రాజకీయ ఉద్రిక్తత నెలకొంది. అరెస్టును నిరసిస్తూ వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం చిప్పగిరి అంబేద్కర్ సర్కిల్‌లో పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం, పోలీసుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు. ధర్నాలో మాజీ ఎంపీ లు తలారి రంగయ్య, బుట్టా రేణుక, మాజీ ఎమ్మెల్యేలు కాటిసాని రాంభూపాల్ రెడ్డి, సాయి ప్రసాద్ రెడ్డి, కంగాటి శ్రీదేవి, ఎమ్మెల్సీ మధుసూదన్, కర్నూలు మేయర్ బీవై రామయ్య, తో పాటు పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎమ్మెల్యే విరుపాక్షి అరెస్టు రాజకీయ కక్షసాధింపులో భాగమేనని ఆరోపించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని కేసులు నమోదు చేస్తున్నారని, పోలీసులను రాజకీయ ఒత్తిళ్లకు గురిచేసి కేసులను తమకు అనుకూలంగా మలుస్తున్నారని ఆరోపించారు. ప్రజల సమస్యలపై పోరాడుతున్న ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కేందుకు అరెస్టులను ఆయుధంగా ఉపయోగిస్తున్నారని వారు పేర్కొన్నారు. ఇలాంటి చర్యలతో ప్రజల స్వరాన్ని అణచివేయలేరని స్పష్టం చేశారు. అలాగే, ఈ ప్రభుత్వం శాశ్వతం కాదు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. మరో రెండేళ్లు ఓపిక పడితే మా అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ అధికారంలోకి వచ్చి ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తారు. చట్టాన్ని దుర్వినియోగం చేసిన వారిపై తగిన చర్యలు తీసుకుంటారు అని వైసీపీ నేతలు వ్యాఖ్యానించారు. ధర్నా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో వైసీపీ శ్రేణులు పాల్గొనడంతో చిప్పగిరి అంబేద్కర్ సర్కిల్ పరిసరాల్లో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని పర్యవేక్షించారు. కాగా, అరెస్టుకు సంబంధించి పోలీసులు తమ వాదనను అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. ఈ కార్యక్రమంలో పామిడి వీరయ్య, వైకుంఠం మల్లికార్జున చౌదరి, శశికళ, చిన్నబాబు, నైరుతి రెడ్డి, ఎమ్మెల్యే సోదరుడు శ్రీరాములు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మారయ్య, మండల కన్వీనర్ మల్లికార్జున, వైసిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# చిన్నదేవలాపురంలో గ్యాస్ పేలుడు

**గాయాల పాలైన కుటుంబ సభ్యులు - ధ్వంసమైన ఇల్లు**







**బండి ఆత్మకూరు ఆగస్టు 02 ( రిపబ్లిక్ న్యూస్) :** మండల పరిధిలో ఉన్న చిన్నదేవులాపురం గ్రామంలోనీ ఒక ఇంట్లో ఆదివారం భారీ పేలుడు సంభవించడంతో ఆ గ్రామ ప్రజలు భయాందోళనకు గురైన పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితి కారణంగా ఊరంతా ఉలికిపాటుకు గురైంది. చిన్న దేవలాపురం గ్రామానికి చెందిన పుట్టుపల్లి సుబ్బరాయుడు (64) భార్య పుట్టుపల్లి నాగమ్మ (56) తో కలిసి ఆదివారం ఉదయం ఉపాధి పనులకు వెళ్లడం జరిగింది. పనులు ముగించుకొని దంపతులిరువురు ఇంటికి చేరుకున్నారు. అప్పటికే ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ లీక్ అవుతూ ఉండడంతో గ్యాస్ అంతా ఇంట్లో ఆవహించింది. ఇది గమనించని నాగమ్మ గ్యాస్ స్టవ్ ను అంటించే ప్రయత్నం చేయడంతో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. దీనితో పుట్టుపల్లి సుబ్బరాయుడు కు కాళ్లకు బలంగా గాయాలయ్యాయి. భార్య నాగమ్మ తలకు చేతులకు పాక్షి కంగా గాయాలయ్యాయి. దురదృష్టవశాత్తు సిలిండర్ పేలిపోయి ఉంటే, పెద్ద ఎత్తున ప్రాణ నష్టం జరిగి ఉండేది. సిలిండర్ పే లకపోవడంతో, స్వల్ప గాయాలతో వృద్ధ దంపతులు బయటపడగలిగారు. పేలుడు కారణంగా ఇంటి వాకిలి కూడా ధ్వంసం అయింది. ఈ సంఘటన తెలిసి వెంటనే చుట్టుపక్కల ఉన్న ప్రజలు వారిని సురక్షితంగా బయటకు తెచ్చి చికిత్సలు చేశారు. చికిత్సల నిమిత్తం దంపతులు ఇరువురిని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.

**సిలిండర్ లీకు కావడం వల్లే ప్రమాదం :** చిన్నదేవలాపురంలో సిలిండర్ లీకు కావడం వల్లే ఇరువురు దంపతులు ప్రమాదానికి గురికావాల్సి వచ్చిందని గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలలో తరచూ లీకుల సిలిండర్లు వస్తున్నాయని ప్రజలు ఆవేపిస్తున్నారు. సిలిండర్ ను నింపే సమయంలో వాచర్ ను మార్చాల్సి ఉన్న, కంపెనీ నిర్వాహకులు ఈ విషయంలో జాగ్రత్తలు వహించడం లేదని పేర్కొంటున్నారు. గ్యాస్ ఏజెన్సీలు సిలిండర్ను సరఫరా చేసే సమయంలో, వినియోగదారులకు సిలిండర్లను దించిపోతున్నారు. తర్వాత మహిళలు సిలిండర్ ను ఏర్పాటు చేసుకునే సమయంలో గ్యాస్ వాసనలు వస్తూ ఉండటంతో, ఈ విషయంపై చాలా గ్రామాలలో మహిళలు ఆందోళన చెందుతున్నారు. గ్యాస్ సిలిండర్ పై అవగాహన ఉన్న కొందరు వ్యక్తులతో మహిళలు మరమ్మత్తులు చేయించుకుంటున్నారు. గ్యాస్ సిలిండర్లు సరఫరా చేసే సమయంలో నిర్వాహకులను వాచర్లు అడిగినప్పటికీ లేవని చేతులెత్తేస్తున్నారు. ఐదు రూపాయల విలువచేసే వాచర్లను కూడా నిర్వాహకులు ఇవ్వడం లేదని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా రిపబ్లిక్
సోమవారం 3 ఆగస్టు 2026

# సాగు భూమికి అడ్డంకులు

**రెవిన్యూ అధికారుల నిర్లక్ష్యం -మహిళ నిండు ప్రాణం బలి -మహిళ మృతితో ఆ కుటుంబం విలవిల**

**భౌతిక దాడులకు తెగబడుతున్న ఓ వర్గీయులు -బాధిత కుటుంబం ఊరు విడిచేందుకు సిద్ధం**






**అనంతపురం క్రైమ్, ఆగస్టు 02,(రిపబ్లిక్ న్యూస్):**
ఎన్నో ఏళ్ల క్రితం గతంలో కొన్న భూమిలో సాగు చేసుకుంటూ ఓ కుటుంబం జీవనోపాధి పొందుతోంది. ఆ కుటుంబం మొత్తం ఆ భూమిలో పంటలు సాగు చేసుకుంటున్నారు. అసలే అనంతపురం కరువు జిల్లా అందులోనూ వర్షాభావం తక్కువ ఉండడంతో పంటలు పండక అప్పులు పాలై బ్రతుకు జీవుడా అనే బ్రతుకుతుంటే... కొందరు దుర్మార్గులు కక్షగట్టి ఆ భూమిని కాజేసేందుకు పన్నాగం పన్నారు. అదే సామాజిక చెందిన కొందరు వ్యక్తులు ఓ కుటుంబానికి చెందిన భూమిలోరాస్తా విషమై గత కొన్ని ఏళ్లుగా విలువర్గాల వారు ఘర్షణలకు పలుమార్లు దిగారు. సాగు చేస్తున్న కుటుంబం పై అదే సామాజిక వ్యక్తులు మరో సామాజిక వ్యక్తులపై దాడులకు తెగబడుతూ.,. భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. సాగు చేస్తున్న ఆ కుటుంబం చివరికి ఊరు వదిలే పరిస్థితి ఏర్పడింది. కుటుంబం మొత్తం ఆ ఊరు వదిలి ఎక్కడికో వెళ్లి బ్రతకాలనుకున్న వారి ఆశలు చివరికి అడి ఆశలుగానే మిగిలాయి అని చెప్పవచ్చు. దుఃఖం బిగబట్టి ఏడ్చినా .. ఆ కుటుంబానికి న్యాయం జరగదు. న్యాయం జరగనివ్వరు. ఆర్థిక బలం, రాజకీయ అండదండలతో వ్యవసాయ కుటుంబం పై భౌతిక దాడులకు తెగబడుతుంది అదే సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు.

### దుర్భాషలాడదంతో మహిళ బలవర్మరణానికి పాల్పడింది

అనంతపురం జిల్లా ఆత్మకూరు మండలంలోని మదిగుబ్బ తండా గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. శనివారం అర్ధరాత్రి ఓ సామాజిక వర్గానికి చెందిన మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన జిల్లా వ్యాప్తంగా సంచలనం రేగింది. వ్యవసాయ కుటుంబం వ్యక్తులు ఆస్తి కోసం పోరాటం చేస్తున్నారు. అదే సామాజిక వర్గానికి చెందిన మరో వర్గీయులు ఎలాగైనా ఆ భూమిని దౌర్జన్యంగా దాడులు చేసి బలవంతంగా లాక్కునేందుకు విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. ఎందుకంటే గతంలో కొన్న వాళ్ళ భూమిలో మరొకరు వెళ్లడానికి రహదారి వదలడం లేదనే ఉద్దేశంతో కక్షగట్టి మహిళలు అని చూడకుండా చెప్పలేని పదజాలంతో దుర్భాషలాడదంతో శనివారం రాత్రి ఓ మహిళ బలవర్మరణానికి పాల్పడింది. దీంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. మృతి చెందిన వ్యక్తిని అనంతపురం సర్వజన ఆసుపత్రి కి తరలించారు. వైద్యులు పోస్టుమార్టం చేసి నివేదిక అందించనున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాల్సి ఉంది.

### రహదారి వదలాలంటూ పలుమార్లు హెచ్చరించి గొడవలు

ముదిగుబ్బ తండాలో ఓ సామాజిక వర్గీయుల భూమిలో రస్తా కావాలని అదే సామాజిక వర్గానికి చెందిన కొందరు వ్యక్తులు బెదిరింపులకు పాల్పడ్డారు. పొలంలో రహదారి వదలకుంటే అడ్డు వచ్చిన వారిని వారు ఎవరైనా సరే ప్రాణాలతో మిగలరంటూ హెచ్చరించిన విషయం విధితమే. పొలం ప్రక్కనున్న వారు పొలం ముందున్న వారి భూమిలో వెళ్లడానికి రహదారి వదలాలంటూ పలుమార్లు హెచ్చరించి గొడవలు చేశారు. బాధిత కుటుంబానికి ఆ భూమిపై సర్వహక్కులు ఉన్నాయి. గతంలో వారు ఆ భూమిని ఒకరి నుంచి కొన్ని సాగు చేసుకుంటున్నామన్నారు. ఈ భూమిలో ఏళ్ల తరబడి పంట పొలాలు పెట్టుకుని జీవనోపాధి పొందుతూ... ఉన్నామన్నారు. అయితే తమ పొలానికి సంబంధించి వన్ బి, అడంగల్, పట్టాదారు పాసుపుస్తకాల తో పాటు వెబ్ ల్యాండ్ లో బాధిత కుటుంబం పై రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వహక్కులు ఉన్నాయని తెలిపారు.
ఈ భూమి సాగు చేసుకుంటుంటే కొందరు వ్యక్తులు ఇది జీర్ణించుకోలేకనే భౌతిక దాడులకు తెగబడుతున్నారని, తమ కుటుంబం పై హత్యాయత్నం చేయడానికి వచ్చారని బాధిత కుటుంబం విలపించింది.

### మరొక వర్గానికి ఆ భూమిని కట్టబెట్టేందుకు విశ్వ ప్రయత్నం

ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ తమ భూమిలో తాము వ్యవసాయం చేసుకొని జీవులకు అది పొందుతున్నామన్నారు. అయితే ఆ భూమి ప్రభుత్వ భూమి అని కొందరు వ్యక్తులు ఆ భూమిపై కన్నేసి ఎలాగైనా లాక్కోవాలని ప్రయత్నం చేస్తున్నారు. ఆ ప్రయత్నంలో భాగంగానే మండల రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై తమ పొలంలో రహదారి వదలాలని కక్షగట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలుమార్లు అర్జీ ఇచ్చామని, సంబంధిత శాఖ అధికారులు వాటిపై స్పష్టత ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ కూడా అధికారులకు రీసర్వే చేయమని పలుమార్లు వేడుకున్నామని అయితే సర్వే చేయడానికి అధికారులు నిరాకరించి నిర్లక్ష్యంగా వ్యవహరించారని అన్నారు. మండల తహసిల్దార్ తో పాటు రెవిన్యూ అధికారులతో రీ సర్వే చేయడానికి తమ పొలంలోకి వచ్చారన్నారు. తహసిల్దార్ ఉత్తర్వులు మేరకు పోలీసులు తమ పొలంలోకి రావడం జరిగింది. అయితే సివిల్ డిస్టిబూట్ ఉన్న భూములలోకి పోలీసులు వచ్చినప్పుడు సమయపాలన పాటించాలి. సంబంధిత వ్యక్తుల భూములకు చెక్కు బంది ప్రకారం, సర్వే చేపట్టి భూమి హద్దులను ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే అధికారులు బాధిత కుటుంబ పక్షాన రీసర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ... అదే సామాజిక వర్గంలోని మరొక వర్గానికి మండల తహసిల్దార్ వత్తాసుపలడం ఎంతవరకు సమంజసం. కాసులకు కక్కుర్తి పడిన రెవిన్యూ అధికారులు భూ హక్కుదారులకు అన్యాయం చేస్తున్నారు. అయితే తహసిల్దార్ ఏకపక్షం నిర్ణయంతో మరొక వర్గానికి ఆ భూమిని కట్టబెట్టేందుకు విశ్వ ప్రయత్నం చేసినట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు వాస్తవంగా భూమి ఎవరిది అనేది రెవెన్యూ తహసిల్దార్ కు తెలుసు. కానీ ఆత్మకూరు మండల తహసిల్దార్ కాసులకు కక్కుర్తి పడి బాధిత కుటుంబానికి చెందిన భూమిని అదే సామాజిక మరో వర్గీకలతో చేతులు కలిపి వారికి కట్టబెట్టేందుకు పన్నాగం పన్నాడు. ఇది జగమెరిగిన సత్యం... వాస్తవంగా రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తే .. ఎక్కడ సమస్య ఉందో అధికారులకు తెలియదా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇది తెలిసి కూడా అధికారులు ఒక వర్గానికి కొమ్ము కాయడం అత్యంత దుర్మార్గం అని అన్నారు. వీటికి తోడు వ్యతిరేక వర్గీయులు తమ భూమిని లాక్కునేందుకు దుర్భాషలాడుతూ మానసిక ఆందోళనకు కలిగించడం వల్లే తమ కుటుంబంలోని మహిళ బలవన్మరణానికి పాల్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి కోసం కుటుంబ పెద్దను కోల్పోయామని బాధిత కుటుంబ సభ్యులు కన్నీటి పర్యవంతమయ్యారు.
తమ కుటుంబానికి రక్షణ కల్పించి వ్యతిరేక వర్గీయులపై చట్టపరమైన చర్యలు తీసుకుని, తమ కుటుంబానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# మత్తు రహిత యువతతోనే వికసిత్ భారత్

## మంత్రి సవిత పిలుపు



**శ్రీ సత్యసాయి / గోరంట్ల, ఆగస్టు 02,(రిపబ్లిక్ న్యూస్):**
మత్తు పదార్థాలకు దూరంగా ఉండే యువతే వికసిత్ భారత్‌కు బలమని రాష్ట్ర మంత్రి సవిత పేర్కొన్నారు. బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో గోరంట్ల వాసవీ కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన 'నషా ముక్త్ యువ్ ఫర్ వికసిత్ భారత్' అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

**మాదక ద్రవ్యాల దుష్పరిణామాలపై ర్యాలీలు**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశాన్ని మత్తు పదార్థాల రహితంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన జాతీయ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ అనే సామాజిక మహమ్మారి నుంచి యువతను రక్షించడం కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ యంత్రాంగం ఉమ్మడి బాధ్యత అని అన్నారు. డ్రగ్స్ నిర్మూలన కోసం రాష్ట్రవ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. యువత భాగస్వామ్యంతో అవగాహన సదస్సులు, క్రీడా పోటీలు, వాకథాన్‌లు నిర్వహించి ఆరోగ్యకర జీవన విధానాన్ని ప్రోత్సహిస్తామని చెప్పారు. విద్యాసంస్థల్లో మాదక ద్రవ్యాల దుష్పరిణామాలపై ర్యాలీలు, చర్చా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.
అనంతరం మంత్రి విద్యార్థులతో కలిసి మాదక ద్రవ్యాల నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండటంతో పాటు వాటి వినియోగాన్ని అరికట్టేందుకు తమ వంతు బాధ్యత నిర్వర్తిస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.






## జిల్లాలో తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలి

### సిపిఐ,ఏపి రైతు సంఘం





**ఓర్వకల్లు ప్రతినిధి, ఆగస్టు 02(రిపబ్లిక్ న్యూస్)**
రాష్ట్రంలో తీవ్ర వర్షాభావంతో రైతాంగం దిక్కుతోచని స్థితిలో ఉందని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జిల్లాలో కరువు స్థానిక చర్యలు చేపట్టాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె జగన్నాథం, జిల్లా కార్యవర్గ సభ్యులు పి రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు ఆదివారం నాడు సిపిఐ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో కరువు పరిశీలన యాత్ర ఓర్వకల్లు మండలంలో ఓర్వకల్లు నన్నూరు గుట్టపాడు ఉయ్యాలవాడ హుస్సేనాపురం గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించారు ఈ సందర్భంగా జగన్నాథం రామకృష్ణారెడ్డి లు మాట్లాడుతూ ఏలినో ప్రభావం వలన తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల రైతుల తీవ్ర నష్టాల్లో ఉంటే ఆదుకోవలసిన రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలకే పెద్దపీట వేస్తోందని వారు తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు వ్యవసాయ పెట్టుబడిగా ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.50 వేలు పెట్టుబడి పెట్టి తీవ్రంగానష్టపోయారన్నారు. వర్షాలు పడక వేసిన పత్తి, వేరుసెనగ, కంది, మొక్కజొన్న, సజ్జలు, విత్తనాలు వేసి తీవ్రంగా నష్టపోయారని జిల్లాను వెంటనే కరువు జిల్లాగా ప్రకటించి, ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం అందజేయాలని, తెలంగాణ తరహాలో రూ.2 లక్షల వరకు రైతు రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఉచితంగా విత్తనాలు, రసాయనిక ఎరువులు ఇవ్వాలని, అదేవిధంగా నిత్యావసర సరుకులు రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేసి రైతులకు కరువు పెన్షన్ అందించడంతో పాటు గుండ్రేవుల, వేదవతి ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి తక్షణమే సహాయం అందించాలని సిపిఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో నెల మూడోవ తేదీన జిల్లా వ్యాప్తంగా తహసిల్దార్ కార్యాలయాల ముందర ధర్నా మరియు18వ తేదీన వేలాది మంది రైతులతో చలో కలెక్టరేట్ నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమాలలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు, ఓర్వకల్ మండల కార్యదర్శి రమేష్, ఏపీ రైతు సంఘం కర్నూలు జిల్లా సహాయ కార్యదర్శి దంభోళంశ్రీనివాసరావు సిపిఐ జిల్లా సమితి సభ్యులు సి మహేష్ నాగరాజు, భద్ర కుమార్, ప్రజానాట్యమండలి నాయకులు దప్పు మాణిక్యం, సుంకన్న,బద్రి, మధు,ఓరకల్లు మండల రైతు సంఘం కార్యదర్శి సుధాకర్, కల్లూరు మండల కార్యదర్శి రాముడు తదితరులు పాల్గొన్నారు

## కర్నూలులో నెట్టేక్స్ ఈవెంట్స్ వారి మధురం ఫ్రెండ్షిప్ డే సందర్భంగా ఘనంగా సంబరాలు




**కర్నూలు ప్రతినిధి, ఆగస్టు 02(రిపబ్లిక్ న్యూస్)**
కర్నూలు నగరంలోని స్థానిక రాకెట్ పార్కులో నెటెక్స్ ఈవెంట్స్ వారి ఆధ్వర్యంలో మధురం చాప్టర్ చాలా అద్భుతంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కర్నూల్ జిల్లా పరిశ్రమల శాఖ, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రివర్యులు టీ.జీ భరత్ మరియు రిటైర్డ్ డిఎస్పి మహబూబ్ బాషా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నెటెక్స్ ఈవెంట్స్ అధినేతలు సోమిశెట్టి షణ్ముఖ శ్రీనివాస్, బండారు సురేష్ మరియు షారన్ లు మీడియాతో మాట్లాడుతూ మీ ఫ్రెండ్షిప్ డే సందర్భంగా మా నెటెక్స్ కంపెనీ ద్వారా మధురం ఈవెంట్స్ అత్యద్భుతంగా కర్నూల్ యూత్ విశేషంగా ఆదరించారని తెలిపారు. మధురం చాప్టర్ 4 ఇంత సక్సెస్ కావడం అభినందనీయ మన్నారు. ఇలాంటి ఈవెంట్స్ మరెన్నో ప్రోగ్రామ్స్ జరుపుతామని తెలిపారు. మీ ఫ్రెండ్షిప్ డే ఇలాగే మధురాతి మధురంగా రాబోవు చాప్టర్ 5,6లు కూడా విజయవంతం చేస్తారని ఆశిస్తామన్నారు. మధురం ఈవెంట్స్ ప్రోగ్రాం కి వచ్చిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీ.జి.బి యూత్ రఘు సింగర్ మరియు స్నేహితులు పాల్గొని విజయవంతం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లలు పెద్దలు యూత్ ఆనందంతో డ్యాన్సులు వేస్తూ సంతోషంగా గడిపారు

## బళ్లారి రాఘవ ఆశయాలు యువతకు స్ఫూర్తి

### డీఆర్వో మాలోల





**అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 02,(రిపబ్లిక్ న్యూస్):**
తెలుగు నాటకరంగ మహానటుడు బళ్లారి రాఘవ జీవితం, ఆశయాలు నేటి యువతకు ఆదర్శంగా నిలవాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) మాలోల అన్నారు. బళ్లారి రాఘవ 146వ జయంతి సందర్భంగా ఆదివారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.
ఈ సందర్భంగా మాలోల మాట్లాడుతూ బళ్లారి రాఘవ కేవలం గొప్ప నటుడే కాకుండా సమాజ మార్పు కోసం కృషి చేసిన మహనీయుడని పేర్కొన్నారు. మేధావిగా, వక్తగా, రచయితగా, దాతగా ఆయన తెలుగు చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. తాడిపత్రిలో 1880 ఆగస్టు 2న జన్మించిన బళ్లారి రాఘవ చిన్న వయసులోనే నాటకరంగంలో ప్రవేశించి తన అభినయం, వాక్చాతుర్యంతో ప్రేక్షకులను అలరించారని చెప్పారు. హరిశ్చంద్ర, పాదుకా పట్టాభిషేకం, సావిత్రి, బృహన్నల, రామరాజు చరిత్ర, రామదాసు, తప్పెవరిది, సరిపడని సంగతులు వంటి నాటకాల ద్వారా ఆయన విశేష ఖ్యాతి పొందారని గుర్తుచేశారు. ఆయన నటనను మహాత్మా గాంధీ సైతం ప్రశంసించారని తెలిపారు. నాటకరంగం ద్వారా సంపాదించిన ధనాన్ని ప్రజల శ్రేయస్సుకు వినియోగించిన మహోన్నత వ్యక్తిగా బళ్లారి రాఘవ నిలిచారని పేర్కొన్నారు. స్వాతంత్ర్యోద్యమానికి మద్దతు ఇవ్వడంతో పాటు మహిళా విద్యాభివృద్ధి, తెలుగు సాహిత్య వికాసానికి ఆయన విశేష సేవలందించారని అన్నారు. విద్యార్థులు బళ్లారి రాఘవ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని కళ, సాహిత్యాన్ని దేశభక్తి, నైతిక విలువల సాధనగా మలుచుకోవాలని మాలోల సూచించారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక అధికారి రమణరెడ్డి, లలిత కళా పరిషత్ కార్యదర్శి పద్మజ, ఆన్‌సెట్ మేనేజర్ శ్రీనివాసులు, యువజన సంక్షేమశాఖ సూపరింటెండెంట్ అన్వర్ బాషా, కలెక్టరేట్ సిబ్బంది, వివిధ కళా సంస్థల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, కళాకారులు పాల్గొన్నారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888



# రాయికల్ ప్రగతి హై స్కూల్ 2002 ఎస్సెస్సి బ్యాచ్ మిత్రుల ఔదార్యం!!

### మిత్రుని కుమార్తెకు పై చదువుల కొరకు 75 వేల రూపాయలు ఆర్థిక సహాయం



**రాయికల్ మండలం ఆగష్టు,02( రిపబ్లిక్ న్యూస్)**
స్నేహితుల దినోత్సవం సందర్భంగా ప్రగతి హై స్కూల్ 2002 ఎస్సెస్సి బ్యాచ్ మిత్రులు తోటి మిత్రుడు మొసరపు శ్రీనివాస్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు . మిత్రుల సమావేశంలో మొసరపు శ్రీనివాస్ అనారోగ్య కారణంగా తన కుమార్తె మొసరపు శ్రీనిధి (పదవ తరగతి, 569 మార్కులు) విద్య కొనసాగించలేని పరిస్థితిలో ఉన్నట్లు తెలిసి, సంయుక్త నిర్ణయంతో సంపూర్ణంగా రూ.75,000/- మిత్రుని కుటుంబానికి అందజేశారు . విదేశాల్లో ఉన్న స్నేహితులు మరియు స్థానిక మిత్రులు కేవలం నాలుగు రోజుల్లోనే అవసరమైన నిధులను సమకూర్చి ఈ సహాయాన్ని అందగా చేసినట్లు సమాచారం . కార్యక్రమంలో పాల్గొన్న పలువురు సభ్యులు మిత్రుల ఔదార్యానికి ప్రశంసలు తెలిపుతూ శ్రీనిధి భవిష్యత్తు లో ఇదే విధంగా నలుగురికి సహాయం అందించే ఉన్నతస్థానంలో ఉండాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

# లోకకళ్యాణం సనాతన ధర్మ పరిరక్షణకు శ్రీరామ హృదయ కలశ యాత్ర..

**"శ్రీరామ" నామస్మరణతో బియ్యం గింజలు సమర్పించిన ప్రజాప్రతినిధులు, భక్తులు...**

**ఇటిక్యాలలో భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా శ్రీరామ హృదయ కలశ యాత్రలో సర్పంచ్ నీరటి శ్రీనివాస్....**

**రాయికల్ మండలం ఆగష్టు,02( రిపబ్లిక్ న్యూస్)**
లోకకళ్యాణం, ధర్మ సంస్థాపన, సనాతన ధర్మ పరిరక్షణ లక్ష్యంగా నిర్వహిస్తున్న శ్రీరామ హృదయ కలశ యాత్ర జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామానికి వికాసతరంగిణి ఆధ్వర్యంలో సర్పంచ్ నీరటి శ్రీనివాస్ జగిత్యాల జిల్లా ఆత్మ చైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి, ఉపసర్పంచ్ నాగిరెడ్డి సాయిరెడ్డి, వీడీసీ చైర్మన్, భజన మండలి అధ్యక్షుడు అనుపురం లింబాద్రి గౌడ్, బద్దం మహేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ లు సామల్ల వేణులావణ్య, మరిపెల్లి నారాయణ గౌడ్, డాక్టర్ రఘునాథ్, వికాస తరంగిణి బాధ్యులు వేల్పుల స్వామి యాదవ్, వార్డు సభ్యులు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ తాలుక లావణ్య, మహిళలు ఘనంగా స్వాగతించి "జై శ్రీరామ్", "శ్రీరామ జయరామ జయ జయ రామ్" నామస్మరణలతో కలశాన్ని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయానికి చేర్చారు. ఆలయ అర్చకులు మరింగంటి రామకృష్ణమాచార్యులు శ్రీరామ అష్టోత్తర శతనామావళితో శ్రీరామ హృదయ కలశానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజాప్రతినిధులు, భక్తులచే "శ్రీరామ" నామస్మరణ చేయిస్తూ బియ్యం గింజలను కలశంలో వేయించారు. ప్రత్యక్ష శ్రీరామ ప్రభువుకు ప్రతీకగా భావించే ఆ కలశాన్ని స్పృశించి నమస్కరించి శ్రీరాముని అనుగ్రహాన్ని




పొందారు. కలశ ఆగమనంతో గ్రామమంతా భక్తి పారవశ్యంతో కళకళలాడింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ జీయర్ స్వామివారి సప్తతి 70,వ తిరునక్షత్రం సంలర్భంగా లోకకళ్యాణార్థం, వర్షాలు సమృద్ధిగా పడాలని, భారతదేశానికి అజేయమైన శక్తికలిగి విశ్వగురు భారత్ గా ఎదగాలని, దేశంపై దేశద్రోహుల, శత్తుదేశాల కుతంత్రాలు పటాపంచలై సుస్థిరమైన ధర్మస్థాపన జరగాలని, ధర్మపాలకులకు రక్షణ కలగాలనే అనేక సంకల్పాతో వికాస తరంగిణి ఆద్వర్యంలో శ్రీరామ హృదయ కలశ యాత్ర నిర్వహిస్తున్నట్లు వికాస తరంగిణి బాధ్యులు వేల్పుల స్వామి యాదవ్ అన్నారు. రాయికల్ మండలంలోని అన్ని గ్రామాల దేవాలయాల్లో రోజుకో గ్రామంలో శ్రీరామ హృదయ కలశానికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం అన్ని కలశాలను హైదరాబాద్ ఆశ్రమానికి తీసుకెళ్లి, శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామివారి సప్తతి (70వ) తిరునక్షత్ర మహోత్సవాల సందర్భంగా దివ్యసాకేతంలో సాకేత శ్రీరాముడికి 1008 శ్రీరామ హృదయ కలశాలతో



శ్రీరామచంద్రమూర్తికి చిన్న జీయర్ స్వామివారు మహాభిషేకం నిర్వహిస్తారని అన్నారు.
ఈ మహోన్నత పుణ్యకార్యంలో దేవాలయ కమిటీ సభ్యులు, సర్పంచులు, గ్రామ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో కొల్లూరి వేణు, ప్రెస్ క్లబ్ బాధ్యులు అనుపురం లింబాద్రి గౌడ్, గన్నవరం గంగాధర్, బయ్యని అంజి, నాగిరెడ్డి, హిమవతి, రొట్టె శ్రీధర్, సంతోష్, అనంతస్వామి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ తాలుక లావణ్య, హిమవతి, చంద రాధ, సృజన, శైలజా, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో పీఆర్సీని వెంటనే ప్రకటించాలి

### పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కుంబాల శ్రీనివాస్ రెడ్డి

**రాయికల్ మండలం ఆగస్టు 02( రిపబ్లిక్ న్యూస్)**
రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల జీతభత్యాల సవరణ కోసం తెలంగాణ ప్రభుత్వం 2023 అక్టోబర్ 2న రెండవ వేతన సవరణ కమిషన్ (పిఆర్సి )ను ఏర్పాటు చేసినప్పటికీ, ఇప్పటివరకు కమిషన్ నివేదికను కూడా బహిర్గతం చేయకుండా జాప్యం చేయడం అత్యంత విచారకరమని పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కుంభాల శ్రీనివాస్ రెడ్డి అన్నారు.వాస్తవానికి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు కొత్త వేతన సవరణ 2023 జూలై 1 నుంచే అమల్లోకి రావాల్సి ఉంది. అలాగే గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రస్తుత అధికార




పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లోనే పీఆర్సీని అమలు చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చింది. అయితే ప్రభుత్వం ఏర్పడి దాదాపు మూడు సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికీ ఆ హామీ అమలుకు నోచుకోకపోవడం ఉద్యోగ వర్గాలను తీవ్ర నిరాశకు గురిచేస్తోందన్నారు.రెండవ పీఆర్సీ నివేదిక 2024 సంవత్సరంలోనే ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉన్నప్పటికీ, ఇప్పటివరకు నివేదికను వెల్లడించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిత్యావసర వస్తువుల ధరలు, జీవన వ్యయం కారణంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లపై తీవ్రమైన ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు.ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం 51 శాతం ఫిట్‌మెంట్‌తో వెంటనే రెండవ పీఆర్సీని ప్రకటించి అమలు చేయాలని, పీఆర్సీలో వేతన స్కేలు, హెచ్ఆర్ఏ స్లాబ్‌లను పునరుద్ధరించి, ఇతర అన్ని అలవెన్స్‌లను గణనీయంగా పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.అదేవిధంగా, ఉద్యోగులకు బకాయిగా ఉన్న ఆరు డీఏలను వెంటనే విడుదల చేయాలని శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాయికల్ మండల శాఖ అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు అంతడుపుల గంగరాజం, రాపర్తి నర్సయ్య, జిల్లా కార్యదర్శి దొంతి సతీష్ లు పాల్గొన్నారు

# అయోధ్య గ్రామానికి రాత్రిపూట బస్సు నడపండి జగిత్యాల డిపో మేనేజర్ను కోరిన అయోధ్య గ్రామ ఉప సర్పంచ్ తవిటి రాజేశం

**రాయికల్ మండలం ఆగష్టు, 02( రిపబ్లిక్ న్యూస్)**
జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అయోధ్య గ్రామానికి రాత్రిపూట బస్సు నడపాలని జగిత్యాల డిపో మేనేజర్ ను కోరిన అయోధ్య ఉపసర్పంచ్ తవిటి రాజేశం మా గ్రామానికి ప్రొద్దున భూపతిపూర్ బస్సు ఆరున్నరకు వచ్చి మళ్లీ తిరిగి అదే బస్సు ఎనిమిదిన్నరకు వస్తుందని అలాగే రాత్రి జగిత్యాల నుండి




తొమ్మిదిన్నరకు బయలుదేరే కొత్తపేట బస్సును అయోధ్య మీదుగా మళ్లించాలని ఆయన కోరారు ఎందుకంటే ఉప్పమాడిగే ఎక్స్ రోడ్డుపై రాత్రి పది గంటలకు దిగిన వ్యక్తి ఒంటరిగా రెండు కిలోమీటర్లు గ్రామంలోకి నడిచి రావాలని దానివల్ల మహిళలకు తీవ్ర ఇబ్బంది ఎదురవుతుందని అందుకొరకై రాత్రి జగిత్యాల నుండి తొమ్మిదిన్నరకు బయలుదేరిన బస్సు అయోధ్య మీదుగా కొత్తపేటకు వెళ్ళవచ్చునని ఆయన అన్నారు తప్పనిసరిగా మాకు రాత్రి బస్సు నడిపించాలని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ను జగిత్యాల డిపో మేనేజర్ ను ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఆయన కోరారు

# కోరిన కోరికలను నెరవేర్చుతున్న మైతాపూర్ గనే గుట్ట "గిరి" పైవున్నా దుర్గా మాత

**రాయికల్ మండలం ఆగష్టు,02( రిపబ్లిక్ న్యూస్)**
పచ్చని చెట్లు ఎత్తైనకు కొండ కిలకిలరాగాలు పలికే పక్షులతో ఎంతో సుందరంగా ఉన్న జగిత్యాల జిల్లా రాయికల్ మండలం మైతాపూర్ గ్రామ పరిధిలోని గన్నే (గిరి)గుట్ట పైన వెలిసిన మరో విజయవాడ కనక దుర్గమ్మ గా భావించే దుర్గమ్మ భక్తులకు కోరిన కోర్కెలు తీర్చడమే కాకుండా భక్తులు ఇతర కోరికలు కోరడం వారి దుర్గమ్మ వెను వెంటనే భక్తుల కోరికలు ఇతరత్రా సమస్యలు నెరవేర్చాడంతో రోజు రోజుకూ మైతాపూర్ గ్రామంలో ఉన్న కనక దుర్గమ్మ సన్నిధి భక్తులతో దిన దినం అమ్మవారి ఆలయం నకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తులు వారి వారి కోరికలను అమ్మవారికి సమర్పించుచూ కోరిన కోర్కెలు నెరవేరినచొ అమ్మవారికి కానుక రూపంలో అమ్మవారికి సమర్పించు కూశీటమని అమ్మవారికి బంగారాన్ని కూడా సమర్పించు కూశీటమని కొంత మంది భక్తులు అమ్మవారిని వేడుకుంటారు,అంతేగాక కొంత మంది భక్తులు అమ్మవారికి పూజలు నిర్వహించి అనంతరం ఓడి బియ్యం మరియు బట్టలు కూడా అమ్మవారికి సమర్పించు కుంటారు..ఇట్టి ఆలయానికి గతంలో ఇటిక్యాల గ్రామానికి చెందిన చెన్నమనేని నివేదిత కృష్ణారావు బాపు దంపతుల సహాయ సహకారాల తో అమ్మవారి ఆలయం నకు గుడి నిర్మాణానికి సహకరించి ఆలయానికి అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసిన మహనీయుడు వెంకట కృష్ణా రావు ఆయన హైదరాబాద్ లో నివాసం ఉంటూ ఇక్కడ నిర్మించిన ఆలయాల అభివృద్ధికి సహకరించడం మరియు రోజు రోజుకు ఆలయానికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుని అక్కడి నుంచి పరిష్కారం చూపేవారు.
అంతటి మహనీయుడు సాక్షాత్తుగా దేవుని రూపంలో




ఉండి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కొంత మంది భక్తులకు దన రూపంలో వస్తు రూపంలో ఎంతోమంది కి దాన ధర్మా లు చేసినట్టు వంటి ఆ మహనీయుడు ఇపుడు మన మధ్య లో లేకపోవడం చాలా బాధాకరమన్నారు.
ఆయన ఇంకా జీవించి ఉంటే వారు ఉన్నంతకాలం వారు ఎన్నో వందల దేవాలయాలు నిర్మించి ఇచ్చే విధంగా ముందుకు వెళ్లే వారు.
మైతాపూర్ గ్రామంలో ఉన్న దుర్గ మాతఆలయంనకు అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఆలయానికి నిధులు మంజూరు చేయాలని రాజ్యసభ సభ్యులు అయిన దినకోండ దామోదర్ రావు స్వంత చెల్లెలు బావా మైతాపూర్ గ్రామనికి చెందిన యాచమనెని అరుణ దేవి కిషన్ రావు వారి సూచన మేరకు దుర్గ మాత ఆలయం కొరకు నిధులు మంజూరు చేయాలని వారు కోరగా వెంటనే వారి రాజ్యసభ నిధుల నుండి మైతాపూర్ గ్రామ అభివృద్ధికి మరియు ఆలయానికి దాదాపుగా ఒక కోటి రూపాయల వరకు నిధులు మంజూరు చేసి ఆలయానికి మెట్లు మరియు ఆలయానికి కోరుట్ల పోపు మెయిన్ రోడ్డు నుండి ఆలయం వరకు సిమెంట్ రోడ్డు మరియు రైతుల



కొరకు ఏర్పాటు చేసిన రైతు వేదిక వరకు సిమెంట్ రోడ్డు మంజూరు చేసి పనులు పూర్తి చేయించారు. అంతేగాక గ్రామంలో బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం కూడ నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేశారు. మిగిలిన బైపాస్ రోడ్డు కొరకు నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. అలాగే ఆలయం వద్ద ఇంకా కొన్ని పనులకు సంబంధించి చేయాల్సిన దాని కొరకు మరియు ఆలయం వద్ద దసరా నవరాత్రి ఉత్సవాల్లో ఎక్కువ సంఖ్యలో భక్తులు మరియు అమ్మవారి దీక్షలు చేపట్టిన భక్తులు ఎక్కువగా ఉంటారు. దసరా పండుగ సందర్భంగా తొమ్మిది రోజులు ఉత్సవాలు ఘనంగా జరుపుతున్న సమయంలో ప్రతి రోజు ఆలయానికి వచ్చే భక్తులకు మరియు స్వామి దీక్షలు చేస్తున్నా వారందరికీ మహా అన్నప్రాశదం ఏర్పాటు చేయడం ద్వారా భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటాయని వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయం వద్ద వంట గదులు లేక పోవడంతో వెంటనే అక్కడ వంట గదులు మరియు భక్తులకు టాయిలెట్ రూమ్ లు అలాగే కమాన్ కొరకు వెంటనే నిధులు మంజూరు చేయాలని భక్తులు ప్రజా ప్రతినిధులను ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# "ఫ్రెండ్షిప్ డే" సందర్భంగా రాయికల్ 8వ వార్డు కౌన్సిలర్ పల్లి కొండ గంగాధర్ డాన్స్ చేస్తున్న వీడియో వాట్సాప్ లో చెక్కర్లు

**రాయికల్ మండలం ఆగస్టు 02( రిపబ్లిక్ న్యూస్)**
జగిత్యాల జిల్లా రాయికల్ మున్సిపాలిటీ 8 వ వార్డు మెంబరు పల్లికొండ గంగాధర్ ఫ్రెండ్స్ ఫ్రెండ్షిప్ డే సందర్భంగా తన ఎస్ఎస్సి బ్యాచ్ తొ డాన్స్ చేస్తూ కనపడడం ఒక విశేషం ఎందుకంటే తను చదువుకున్న రోజులు గుర్తు తెచ్చుకొని తన మిత్రబృందమైన పదో తరగతి విద్యార్థులతో డాన్సులు చేస్తున్న ఫోటోలు వాట్సాప్ లో చెక్కర్లు కొడుతుంది ఇది ఒక విశేషంగా పట్టణ వాసులు చూస్తూన్నారు





# అందోల్ మండల్ జోగిపేట్,13వ వార్డులో ఘనంగా బోనాల పండుగ







**అందోల్ ప్రతినిధి ఆగస్టు 2 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
కౌన్సిలర్ పట్లూరి శివశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా బోనాల కార్యక్రమంతెలంగాణ, కెరటం స్టేట్ ఇంచార్జ్ షేక్ మహబూబ్ 2, ఆగస్ట్,ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి వైస్ చైర్మన్ చిట్టిబాబు పదో వార్డ్ కౌన్సిలర్ పట్లోళ్ల ప్రవీణ్ 13వ వార్డ్ మాజీ కౌన్సిల్ రంగా సురేష్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డాకూరి వెంకన్న కాసాల ప్రవీణ్ డాక్టర్ సోమప్ప ఆకుల శంకర్ రాజు శ్రీశైలం విట్టల్ పవన్ మనీ రాములు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో మహిళలు పురుషులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# ఆషాడం మాసం బోనాలు మూడవ ఆదివారం ఘనంగా బోనాల పండుగ







**నర్సాపూర్ ప్రతినిధి ఆగస్టు 2 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
మెదక్ జిల్లా కౌడిపల్లి మండల్ గ్రామం బుజరంపేట పోచమ్మబోనాలు మూడవ ఆదివారం ఘనంగా బోనాల పండుగ ఆషాడం మాసం
గ్రామ సర్పంచ్ పట్లోళ్ల శ్రీనివాస్ ఉప సర్పంచ్ కౌడిపల్లి గోపాల్ గ్రామ పెద్దలు అందరూ ఆధ్వర్యంలో పాలకవర్గ చిన్న పెద్ద తేడా లేకుండా వర్షం మంచిగా పడాలని గ్రామంలో అందరూ మంచి ఉండాలని వర్షాలు మంచిగా పడాలని అందరూ కలిసిమెలిసి బోనాల పండుగ ఆషాడ మాసం సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలని గ్రామ పెద్దలు అంగీకారం చేత అందరూ కలిసి అమ్మవారు దయవల్ల అందరూ సుఖసంతోషాలతో ఉండాలని చిన్న పెద్ద తేడా లేకుండా అధిక సంఖ్యలో అంగరంగ వైభవంగా డప్పు చప్పులతో డోలు చప్పులతో పోతరాజుల విన్యాసం శివసత్తుల విన్యాసం గ్రామ దేవతలందరికీ భక్తిశ్రద్ధలతో ఆటపాటలతో ఎంతో పోచమ్మ టెంపుల్ అలంకరణతో ఒగ్గొల్ల ప్రతిసారి బోనాలు తీయడం జరుగుతుందివిన్యాసాలతో

## వరుణుడి కరుణ కోసం శెట్టిపేటలో ఘనంగా 'కప్పదేవర'



**చౌడేపల్లి ప్రతినిధి ఆగస్టు 02 రిపబ్లిక్ న్యూస్**
సకాలంలో వర్షాలు కురవకపోవడంతో వరుణ దేవుడిని ప్రసన్నం చేసుకునేందుకు మండలంలోని శెట్టిపేట గ్రామస్తులు ప్రాచీన ఆచారమైన 'కప్పదేవర' (కప్పల పెళ్లి) వేడుకను ఘనంగా నిర్వహించారు. తొలుత స్థానిక మోక్ష గణపతి ఆలయం వద్ద పలు కార్యక్రమాలు నిర్వహించారు రుతుపవనాలు ముఖం చాటేయడం, ఆకాశంలో మబ్బులు కమ్ముకున్నా చినుకు రాలకపోవడంతో సాగుకు సిద్ధమైన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో వాన దేవుడి కరుణ కోసం గ్రామస్తులంతా ఏకమై సంప్రదాయబద్ధంగా ఈ వేడుకను జరిపారు.

**అంగరంగ వైభవంగా కప్పల పెళ్లి:**
గ్రామస్తులు ఉదయాన్నే పొలాల్లోకి వెళ్లి రెండు కప్పలను పట్టుకొచ్చారు. వాటిలో ఒకదానిని పెళ్లికొడుకుగా, మరొకదానిని పెళ్లికూతురుగా అలంకరించారు. పసుపు నీళ్లతో స్నానం చేయించి, కుంకుమ బొట్లు పెట్టి, పూల దండలు వేసి నూతన వస్త్రాలతో ముస్తాబు చేశారు. అనంతరం వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ కప్పలకు శాస్త్రోక్తంగా వివాహం జరిపారు.

**గ్రామ పురవీధుల్లో ఊరేగింపు:**
వివాహానంతరం కప్పలను ఒక పల్లకిలో ఉంచి, డప్పు చప్పుళ్లు, మహిళల కోలాటాల మధ్య గ్రామ పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. మహిళలు కప్పలకు మంగళ హారతులు పట్టారు. ఈ సందర్భంగా "వాన దేవుడా.. వానలు కురిపించు.. పంటలు పండించు" అంటూ గ్రామస్తులు పాడిన జానపద గీతాలు ఆకట్టుకున్నాయి. ఊరేగింపు పూర్తయిన తర్వాత ఆ రెండు కప్పలను తీసుకెళ్లి స్థానిక చెరువులో విడిచిపెట్టారు.

# బోయకొండపై పోటెత్తిన భక్తజనం






**చౌడేపల్లి ప్రతినిధి ఆగస్టు 02 రిపబ్లిక్ న్యూస్**
బోయకొండ శక్తి క్షేత్రంలో భక్తులు పోటెత్తారు రాష్ట్రం తో పాటు కర్ణాటక తమిళనాడు ల నుంచి ఉదయాన్నే అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనార్థం కోసం క్యూ లైన్లలో వేచి ఉన్నారు. గంగాపురం నుంచి అమ్మవారి సన్నిధానం వరకు ఎక్కడ చూసినా భక్త జన సందోహం కనిపించింది. రణభేరి గంగమ్మ ఆలయం నుంచి అమ్మవారి పుష్కరిణి వరకు ఎక్కడపడితే అక్కడ వాహనాలు ఆగిపోవడంతో. ట్రాఫిక్కు తీవ్ర అంతరాయం వాటిలింది. క్యూలైన్లు సన్నిధానం పెద్ద భోగం చిన్న భోగం కార్యాలయ సముదాయం వంటి ప్రాంతాలలో ఈవో ఉప కమిషనర్ ఏకాంబరం పర్యవేక్షించారు భక్తులకు ఎటువంటి ఆటంకం కలగకుండా తగు చర్యలు తీసుకున్నారు క్యూ లైన్ లలో పలు చోట్ల ప్రక్షాళన చేయడం వల్ల సాధారణ భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం సులభంగా జరిగింది ఆలయ పరిసర ప్రాంతాలు వాహన రాకపోకలు అంతరాయం వాటిల్లకుండా ఎస్సై చిన్న రెడ్డప్ప బందోబస్తు చర్యలు తీసుకున్నారు.ఆలయ అధికార అర్చక సిబ్బంది భక్తులకు సేవలు అందించారు.

# రేషన్ దుకాణాల్లో కందిపప్పు మంచి నూనె గోధుమపిండి ఇతర సరుకులు ఇవ్వాలి

**సిపిఎం పార్టీ నన్నూరు శాఖా కార్యదర్శి ఎస్ మధుసూదన్ డిమాండ్**



**ఓర్వకల్లు ప్రతినిధి, ఆగస్టు 02 (రిపబ్లిక్ న్యూస్)** ఆదివారం రోజు ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామంలోని రేషన్ దుకాణాలను సిపిఎం పార్టీ బృందం సందర్శించి అక్కడ ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా సిపిఎం పార్టీ నన్నూరు శాఖా కార్యదర్శి ఎస్ మధుసూదన్ పార్టీ సభ్యులు మల్లేష్ సలాం భాష హరికుమార్ పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలు లేక వ్యవసాయ పనులు ఇతర పనులు దొరకక పేదలు కార్మికులు పెరిగిన ధరలకు కొనలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చౌక దుకాణాల ద్వారా బియ్యం చక్కెర కందిపప్పు మంచి నూనె గోధుమపిండి ఇతర వస్తువులు అందించాల్సిన వారు అవేవీ ఇవ్వకుండా బియ్యం చెక్కర మాత్రమే అందించడం సిగ్గుచేటైన విషయమని విమర్శించారు ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి కరువు నేపథ్యంలో చౌక దుకాణాల ద్వారా బియ్యం చక్కర తో పాటు కందిపప్పు మంచి నూనె గోధుమపిండి ఇతర వస్తువులన్నీ అందించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు



# ఆటో డ్రైవర్ల ప్రత్యేక సమావేశం

**సంగారెడ్డి ప్రతినిధి ఆగస్టు 2 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
ఆటో డ్రైవర్ల దినోత్సవం సందర్భంగా జి ఎం ఆర్ ఆటో యూనియన్ అధ్యకులు గూడెం మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో పటాన్చెరులో ప్రత్యేక సమావేశం.... పాల్గొన్న రాష్ట్ర ఆటో జె ఏ సి ఉపాధ్యక్షుడు చోటు బాయ్ (దస్తగీర్), ఆటో యూనియన్ సభ్యులు
నేడు ఆటో డ్రైవర్ల దినోత్సవం సందర్భంగా పటాన్చెరు లోని జి ఎం ఆర్ ఆటో యూనియన్ అధ్యక్షులు శ్రీ గూడెం మధుసూదన్ రెడ్డి గారి ఆధ్వర్యంలో పటాన్చెరువులో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.
ఈ కార్యక్రమంలో గూడెం మధుసూదన్ రెడ్డి గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వారితో పాటు తెలంగాణ రాష్ట్ర ఆటో జె ఏ సి ఉపాధ్యక్షుడు చోటు బాయ్ దస్తగీర్ మరియు ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గూడెం మధుసూదన్ రెడ్డి గారు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించి మగవారికి టికెట్ రేట్లు డబల్ చేయడంతో ఉచిత బస్సు సౌకర్యం నిరుపయోగమేనని అన్నారు. దీని వల్ల పేద వారికి ఒరిగింది ఏమి లేదు




కానీ ఆటోనే జీవనోపాధిగా చేసుకొని జీవిస్తున్న ఆటో డ్రైవర్లకు మాత్రం తీరని అన్యాయం జరిగిందని అన్నారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఆటో సంక్షేమ బోర్డు ఏర్పాటు, ఆటో డ్రైవర్లకు 12000 వేల రూపాయల నగదు అమలు చేయడం చేతకాక ఇప్పుడు ఫస్ట్ మైల్ టు లాస్ట్ మైల్ వరకు ఆర్టీసీ ఆటో అనే సరికొత్త నాటకంతో ఆటో డ్రైవర్లను మభ్యపెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేయడం జరిగింది
ఈ కార్యక్రమంలో అశోక్ ,మధు, సాదిక్, జార్జ్,ఖాదర్, మాణిక్, ఇమాం సాబ్, రఫీ,అక్బర్,ఇర్ఫాన్, అనంతయ్య,యాదయ్య,మాజిద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శనగర్ కాలనీలో ఘనంగా బోనాల పండుగ వేడుకలు

**-12వ ఏడాది నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో మహిళల భారీ గా పాల్గొన్నారు**





**అందోల్ ఆగస్టు 2 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
ఆదర్శనగర్ కాలనీలో ఆదర్శనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కే. శంకర్ ఆధ్వర్యంలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. కాలనీలో వరుసగా 12వ సంవత్సరం బోనాల ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా కాలనీలోని మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో సాగిన వేడుకల్లో కాలనీవాసులు ఉత్సాహంగా పాల్గొని పండుగను విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో నర్సింగ్, చంద్రశేఖర్, రాజ్‌కుమార్, తుకారం, ఆనంద్, వెంకటేశం, ఏవీ నర్సింలు, నరసింహరాజు, మారుతి, ప్రశాంత్, మల్లారెడ్డి, అడివయ్యతో పాటు ప్రసన్నవాణి, అంజలి, విశాల, వాణి, లక్ష్మి, రుక్మిణి తదితర మహిళలు పాల్గొన్నారు. కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య విజయవంతంగా ముగిసింది.



# సెకండ్ ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్షిప్-2026లో జోగిపేట విద్యార్థులు









**అందోల్ ఆగస్టు 2 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్**
హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన 2వ ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్షిప్ 2026 కోబుడో కరాటే టోర్నమెంట్ జరిగింది.సంగారెడ్డి జిల్లా అందోల్ మండల్ జోగిపేటకు చెందినటువంటి క్రీడాకారులు విశేష ప్రతిభ కనబరిచారు.సంగారెడ్డికి చెందిన గ్రాండ్ మాస్టర్ ఎం.డి. సాజిద్ ఆధ్వర్యంలో, జోగిపేటకు చెందిన కోచింగ్ మాస్టర్ అశోక్ శిక్షణలో మొత్తం 10 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని పలు పతకాలు సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచారు.

గోల్డ్ మెడల్ విజేతలు:
బైండ్ల జోష్ణ ,జమీల్ ,విఖ్యాత్ ,జస్వంత్
సిల్వర్ మెడల్ విజేతలు:
ప్రణయ్ ,రితీష్ ,కుశ్వంత్ ,సాయి విఅన్ష్ ,అభిరామ్

విజేతలను గ్రాండ్ మాస్టర్ ఎం.డి. సాజిద్, కోచ్ అశోక్ మాస్టర్, తల్లిదండ్రులు అభినందిస్తూ భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ విజయంతో జోగిపేట, సంగారెడ్డి జిల్లాకు చెందిన మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారులు మరోసారి తమ ప్రతిభను చాటుకున్నారు.

# దళిత గ్రామాల దరిద్రానికి నేను రాను!

**పారిశుద్ధ్యం పై జీవి పురం పంచాయతీ కార్యదర్శి తీరు ఇది. -పోలంరెడ్డి మల్లికార్జున.**

**రైల్వే కోడూరు ఆగస్టు 1 రిపబ్లిక్ న్యూస్.** జీవిపురం హరిజనవాడలో డ్రైనేజీ కెనాల్ వ్యర్థ పదార్థాలతో డ్రైనేజీ వాటర్ తో నిండిపోయి రోడ్డుపైకి వ్యర్థ మీరు విస్తరించడంతో గ్రామంలో పాదాచార్యులు చిన్న పిల్లలు వృద్ధులు వాహనదారులు సంచరించడానికి తీవ్ర విఘాతం ఏర్పడడంతో ప్రజా పారిశుద్ధ్యం కోసం జీవిపురం పంచాయతీ కార్యదర్శికి ఫోన్ ద్వారా సమాచారం తెలియజేయగా ఏమాత్రం ఆలోచించకుండా దళితవాడ దరిద్రానికి నేను రాను హరిజనవాడ లేదా దళిత కాలనీలో పారిశుద్ధ్య పనులను చూడడానికి నేను రాను అలవాటు నాకెప్పుడు లేదు అంటూ నాకు సమయం ఉంటే నా కిందిస్థాయి పారిశుద్ధ కార్మికున్ని పంపిస్తానని తెగేసి చెప్పడం జరిగిందని రాష్ట్ర అంబేద్కర్ సేవా సమితి నాయకుడు ఆవేదన వ్యక్తం చేశారు గతంలో గ్రీన్ అంబాసిడర్ మరియు గ్రీన్ గార్డెన్ పారిశుద్ధ కార్మికుల నియామకంలో వారికిచ్చే గౌరవ వేతనాలలో నిర్వర్తించే విధుల వైఫల్యంలో కీలక పాత్ర పోషించి చేతివాటం చూపించి తలా ఇంత అన్నట్లుగా పారిశుద్ధ కార్మికుల గౌరవ వేతనాన్ని జీవి పురం గ్రామపంచాయతీ కార్యదర్శి మరియు సర్పంచ్ పంచుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయని ఆయన ఆరోపించారు



అదేవిధంగా జీవీపురం దళితవాడలో అడవి పందులు పిల్లలపై దాడి చేసినప్పుడు జి.వి పురం పంచాయతీ కార్యదర్శి ఎస్సీ ఎస్టీ చట్టం అమలు చేయడంలో తీవ్రంగా విఫలం చెంది కనీసం పరామర్శించకుండా చట్టం యొక్క నియమ నిబంధనలు గాలికి వదిలేసాడనే ఆరోపణలు ఉన్న సందర్భంగా. ప్రస్తుతం దళితవాడలకు నేను రాను అని తగేసి చెప్పడంలో కూడా మతలబు ఉందని ఇలా అధికార దుర్వినియోగానికి పాల్పడడమే కాకుండా దళిత ప్రజలపై తీవ్రమైన వివక్షత పరోక్షంగా ప్రదర్శిస్తున్నాడని ఆరోపణలు గ్రామంలో వినిపిస్తున్నాయన్నారు, గ్రామాలలో పారిశుద్ధ్యం మౌలిక వసతులు చూడవలసిన ముఖ్య విధి, దీనిని తుంగలో తొక్కి పంచాయతీ కార్యదర్శి దళిత గ్రామాలపై వివక్ష చూపుతూ కులం పేరుతో మాట్లాడడం దళితులను అవమానపరచడమేనని ఇలాంటి వ్యక్తి పంచాయతీ కార్యదర్శిగ అనర్హుడని ఆయన అన్నారు ఈ విషయంపై జిల్లా డిఎల్పిఓ కి, జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేయడం జరుగుతుందన్నారు మండల అభివృద్ధి అధికారి క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని పత్రికా ప్రకటన ద్వారా కోరుతున్నాను అన్నారు, కావున తిరుపతి జిల్లా కలెక్టర్ ఓబులవారిపల్లి ఎంపీడీవో వెంటనే స్పందించి విధులు నిర్వర్తించడంలో వైఫల్యం చెంది దళిత ప్రజలపై వారి తాలూకు చట్టాన్ని అమలు చేయడంలో వివక్షత చూపుతూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నాడు కనుక చట్టపరమైన చర్యలు తీసుకొని దళిత సామాజిక చట్టం నియమ నిబంధనలను దళిత సామాజిక ఆత్మ గౌరవాన్ని కాపాడాలని అన్నారు

# కలెక్టరేట్‌లో ఘనంగా బళ్ళారి రాఘవ జయంతి వేడుకలు

### నాటక రంగానికి బళ్ళారి రాఘవ సేవలు స్ఫూర్తిదాయకం: జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ







**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 2)**
జిల్లా యువజన సంక్షేమ శాఖ మరియు సెట్కూర్ ఆధ్వర్యంలో, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ అధ్యక్షతన కర్నూలు కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో తెలుగు నాటక రంగ పితామహుడు, మహానటుడు బళ్ళారి రాఘవ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

కార్యక్రమ ప్రారంభంలో బళ్ళారి రాఘవ చిత్రపటానికి ముఖ్య అతిథులు పూలమాలలు అర్పించి, దీపప్రజ్వలన చేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కళా ప్రస్థానం, దేశభక్తి, సామాజిక చైతన్యం, తెలుగు నాటక రంగానికి చేసిన విశిష్ట సేవలను స్మరించుకుంటూ ప్రత్యేక సభ నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ మాట్లాడుతూ, బళ్ళారి రాఘవ కళను సమాజ చైతన్యానికి సాధనంగా మలిచిన మహోన్నత వ్యక్తి అని పేర్కొన్నారు. మహిళలు, యువత కళారంగంలో ముందుకు రావడానికి ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని అన్నారు. సాంస్కృతిక విలువలను పరిరక్షిస్తూ తెలుగు భాష, సాహిత్యాన్ని భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.

లలిత కళా సమితి సాంస్కృతిక సంఘం అధ్యక్షులు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ, బళ్ళారి రాఘవ కేవలం నటుడు మాత్రమే కాదని, తెలుగు సంస్కృతికి జీవం పోసిన మహానుభావుడని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల్లో నాటక కళను ప్రోత్సహించడం ద్వారా యువతలో సృజనాత్మకత, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత పెంపొందుతాయని చెప్పారు. కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

ఆంధ్రప్రదేశ్ తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కనుసుకర కరణ్ మాట్లాడుతూ, తెలుగు సినిమా మరియు నాటక రంగాలు ఒకే మూలాల నుంచి అభివృద్ధి చెందాయని అన్నారు. బళ్ళారి రాఘవ వంటి మహానటుల సేవలను గుర్తు చేసుకోవడం ద్వారా నేటి తరం కళాకారులకు దిశానిర్దేశం లభిస్తుందని పేర్కొన్నారు. తెలుగు కళా సంప్రదాయాన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత విస్తరించేందుకు ఫిలిం ఛాంబర్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

జిల్లా యువజన సంక్షేమ శాఖ అధికారి, సెట్కూర్ సీఈఓ డాక్టర్ కె. వేణుగోపాల్ మాట్లాడుతూ, యువతలో కళలు, సంస్కృతి, భాష, సాహిత్యంపై అభిరుచి పెంపొందించడం యువజన సంక్షేమ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. బళ్ళారి రాఘవ వంటి మహనీయుల జయంతి కార్యక్రమాలు యువతలో విలువలు, సేవాభావం, దేశభక్తిని పెంపొందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. జిల్లాలో ప్రతిభావంతులైన యువ కళాకారులను గుర్తించి, వారికి తగిన వేదికలు కల్పించేందుకు శాఖ కట్టుబడి ఉందని తెలిపారు.

డీవీఎం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, బళ్ళారి రాఘవ సేవలు తెలుగు నాటక చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. కళ అనేది వినోదానికి మాత్రమే పరిమితం కాకుండా సమాజంలో విలువలు, నైతికత, దేశభక్తి, మానవతా దృక్పథాన్ని పెంపొందించే శక్తివంతమైన సాధనమని పేర్కొన్నారు. యువత నాటక రంగం, సాహిత్యం, సాంస్కృతిక కార్యక్రమాల పట్ల ఆసక్తి పెంపొందించుకొని తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. బళ్ళారి రాఘవ ఆశయాలను కొనసాగించడం ప్రతి కళాకారుడి సామాజిక బాధ్యత అని తెలిపారు.

# మత్తు పదార్థాల నిర్మూలనకు యువతే శక్తి

## 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమం ప్రారంభం

### -సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాలలో మై భారత్ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ కార్యక్రమం

### -వికసిత్ భారత్2047 లక్ష్య సాధనకు యువత ముందుండాలని ప్రధాని మోదీ పిలుపు






**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 2)**
భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మై భారత్ (నా యువ భారత్) చేపట్టిన దేశవ్యాప్త "నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్" ప్రారంభ కార్యక్రమాన్ని కర్నూలు మై భారత్ కేంద్రం సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాలలో ఘనంగా నిర్వహించింది.

ఈ కార్యక్రమాన్ని ప్రధానమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. మాదక ద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా ప్రజల భాగస్వామ్యంతో 100 వారాల పాటు నిర్వహించనున్న జన్ భాగీదారి ఉద్యమానికి శ్రీకారం చుడుతూ, వికసిత్ భారత్2047 లక్ష్య సాధనలో యువత కీలక పాత్ర పోషించాలని ప్రధాని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా మై భారత్ కర్నూలు కేంద్ర జిల్లా యువజన అధికారి పి. ఐజయ్య యువతతో కలిసి "నషా ముక్తి భారత్ ప్రతిజ్ఞ" చేయించారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండటంతో పాటు సమాజాన్ని మత్తు పదార్థాల రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి యువకుడు బాధ్యతగా వ్యవహరించాలని ఆయన సూచించారు.

దేశవ్యాప్తంగా 25 వేలకుపైగా కేంద్రాల్లో ఒకేసారి నిర్వహించిన ఈ కార్యక్రమంలో కోటికి పైగా యువత పాల్గొని ప్రతిజ్ఞ చేయడం విశేషమని ఐజయ్య తెలిపారు. మాదక ద్రవ్యాల వ్యతిరేకంగా దేశంలోనే అతిపెద్ద యువజన ఉద్యమాలలో ఇది ఒకటిగా నిలిచిందన్నారు. రాబోయే 100 వారాల పాటు అవగాహన ర్యాలీలు, క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ధ్యాన శిబిరాలు, చర్చా వేదికలు, వీధి నాటకాలు మరియు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు శెట్టి మాట్లాడుతూ, మై భారత్ వాలంటీర్లు, యువతతో పాటు ప్రతి పౌరుడు ఈ ఉద్యమంలో భాగస్వామి కావాలని కోరారు. మత్తు పదార్థాల రహిత, అభివృద్ధి చెందిన భారత నిర్మాణానికి అందరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మై భారత్ వాలంటీర్లు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, యువజన సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, విద్యాసంస్థల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు మరియు ఇతర భాగస్వాములు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# లయన్స్ సేవా సంస్థ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గా ప్రమాణ స్వీకారం చేసిన డాక్టర్ రవి కృష్ణ

### . గుత్తిలో జరిగిన లయన్స్ జిల్లా 316 జె 9వ జిల్లా క్యాబినెట్ సదస్సులో.

### . ప్రమాణ స్వీకారం చేయించిన మాజీ అంతర్జాతీయ లయన్స్ సేవా సంస్థ డైరెక్టర్ మదన్ మోహన్

**నంద్యాల ఆగస్టు 2 (రిపబ్లిక్ న్యూస్) :**
లయన్స్ అంతర్జాతీయ సేవా సంస్థ లో నంద్యాల, కర్నూలు, కడప, అన్నమయ్య, తిరుపతి అనంతపురం, సత్యసాయి, నెల్లూరు జిల్లాల లయన్స్ క్లబ్ లో తో కూడిన లయన్స్ జిల్లా 316 జె లయన్స్ జిల్లా గవర్నర్ విరూపాక్ష రెడ్డి అధ్యక్షతన ఆదివారం గుత్తిలో జరిగిన నూతన క్యాబినెట్ ప్రమాణ స్వీకార కార్యక్రమం లో నంద్యాల కు చెందిన డాక్టర్ రవి కృష్ణ తో రెండవ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గా అంతర్జాతీయ లయన్స్ సేవా సంస్థ మాజీ అంతర్జాతీయ డైరెక్టర్ మదన్ మోహన్ పదవి ప్రమాణ స్వీకారం చేయించారు. గూడూరు కు చెందిన వెంకటేశ్వరరావు ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గా, గ్లోబల్ యాక్షన్ టీం చైర్మన్ లు గా రవి ప్రకాష్, సుధాకర్ రెడ్డి నంద్యాల కు చెందిన నిజాముద్దీన్, సూళ్లూరుపేటకు చెందిన డాక్టర్ ఆదిశేషారెడ్డి, రీజియన్ చైర్మన్ లు గా, నంద్యాలకు చెందిన సోమేశుల నాగరాజు తో పాటు 17 మంది జోన్ చైర్మన్ లు పదవి ప్రమాణ స్వీకారం చేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ రానున్న మూడు సంవత్సరాల లో లయన్స్ సేవా సంస్థ ద్వారా డిస్ట్రిక్ట్ 316 జె లో ఉన్న 50 కి పైగా క్లబ్బులలో, ఆయా క్లబ్బుల సభ్యుల సహకారంతో, గవర్నర్ విరూపాక్ష రెడ్డి, ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వెంకటేశ్వరరావు లతో కలసి సేవా కార్యక్రమాలను ముమ్మరం చేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి లయన్స్ సీనియర్ నాయకులు అంబటి సుధాకర్ రెడ్డి, మూల్పూరు ఉపేంద్ర, ఆంధ్రప్రదేశ్ లయన్స్ సమాఖ్య మాజీ చైర్మన్ ఏ వి ఆర్




ప్రసాద్, డాక్టర్ గోపాలరావు, అనిల్ జైన్, పాపారావు, వేణుబాబు, గద్దె శేషగిరి,మాజీ లయన్స్ జిల్లా గవర్నర్లు నాగేశ్వరరావు, మాణిక్య ప్రభు,డి ఎస్ కుమార్, చిన్నపరెడ్డి, కిషోర్,రమేష్ నాద్ రెడ్డి, రామ చంద్ర ప్రకాష్, గౌతమ్, గోపాలకృష్ణ, నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సందీప్, సీనియర్ సభ్యులు శ్రీకాంత్, రవి ప్రకాష్, సుధాకర్ రెడ్డి, నిజాముద్దీన్, సోమేశుల నాగరాజు,బైసాని రమేష్, మహేశ్వర్ రెడ్డి, చంద్రమోహన్, కసెట్టి చంద్రశేఖర్,ఇమ్మడి రామకృష్ణుడు, కన్నయ్య,జనార్ధన్, సురేష్,ఆంధ్ర ప్రదేశ్ లో ఉన్న 5 లయన్స్ జిల్లాల గవర్నర్లు,వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్లు, గ్రేటర్ రాయలసీమ లో ఉన్న 8 జిల్లాల పరిధిలోని లయన్స్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# తెలుగు నాటక రంగానికి బళ్ళారి రాఘవ సేవలు చిరస్మరణీయం

### బళ్ళారి రాఘవ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం

### డిఆర్ఓ డి. రాము నాయక్



**నంద్యాల బ్యూరో, ఆగస్టు 02 (రిపబ్లిక్ న్యూస్):**తెలుగు సాహిత్యంలో ప్రజాకవి, సమాజ సంస్కర్త, నాటకరంగ ప్రస్థానానికి విశిష్ట సేవలందించిన బళ్ళారి రాఘవ జీవిత విశేషాలు, సమాజానికి చేసిన సేవలు స్ఫూర్తిదాయకమని జిల్లా రెవెన్యూ అధికారి డి. రాము నాయక్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో బళ్ళారి రాఘవ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా డిఆర్ఓ డి. రాము నాయక్ మాట్లాడుతూ బళ్ళారి రాఘవ తెలుగు నాటక రంగానికి కొత్త ఒరవడి తీసుకువచ్చి, సహజ నటనకు ప్రాధాన్యం కల్పించారని తెలిపారు. సామాజిక చైతన్యం, మానవతా విలువలు, స్త్రీ గౌరవం వంటి అంశాలను తన నాటకాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లి సమాజ సంస్కరణకు విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు. తెలుగు, కన్నడ, ఆంగ్ల భాషలపై పట్టు కలిగిన ఆయన రంగస్థల నటుడిగానే కాకుండా రచయితగా, దర్శకుడిగా, సంఘ సంస్కర్తగా చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. బళ్ళారి రాఘవ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలని డిఆర్ఓ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక అధికారి సునిల్ కన్నా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 3న ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహణ



**నంద్యాల బ్యూరో, ఆగస్టు 02 (రిపబ్లిక్ న్యూస్):**
జిల్లా ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించి, ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు అందించాలనే లక్ష్యంతో 3వ తేదీ (సోమవారం) జిల్లా వ్యాప్తంగా "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్)" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లా కలెక్టరేట్‌తో పాటు అన్ని రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, మండల పరిషత్ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో ఒకేసారి నిర్వహించబడుతుందని తెలిపారు. ఉదయం 10.00 గంటల నుంచి ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులు వాటి పరిష్కారానికి చర్యలు చేపడతారని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను నేరుగా కార్యక్రమంలో సమర్పించవచ్చని, అలాగే వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా ఫిర్యాదులు నమోదు చేసుకునే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. సమర్పించిన అర్జీల పరిష్కార స్థితిని అదే వెబ్‌సైట్‌లో లేదా టోల్ ఫ్రీ నంబర్ 1100 ద్వారా తెలుసుకోవచ్చని వివరించారు. అర్జీదారులు తమ సమస్యలకు సంబంధించిన వినతులను ముందుగా మండల, రెవెన్యూ డివిజన్ లేదా మున్సిపల్ స్థాయి కార్యాలయాల్లో సమర్పించి, అక్కడ పరిష్కారం కాని అంశాలను మాత్రమే జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లా కేంద్రంలో ఉదయం 10.00 గంటలకు ప్రారంభమయ్యే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల వినతులను స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# రౌడీషీటర్లకు, నేరచరిత్ర కలిగిన వారికి కౌన్సిలింగ్

### నేర ప్రవృత్తికి స్వస్తి పలికి సమాజంలో మంచి పౌరులుగా మెలగాలి





**నంద్యాల క్రైం, జూలై 2, (రిపబ్లిక్ న్యూస్):** జిల్లాలో నేరనియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు వారి పోలీస్ స్టేషన్ల పరిధిలో నివసిస్తున్న రౌడీ షీటర్లకు ,నేరచరిత్ర గలవారికి ,చెడు నడత కలిగిన వ్యక్తులకు సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం ప్రస్తుతం వారు జీవిస్తున్న విధానం, జీవనోపాధికి చేస్తున్న వృత్తులపై ఆరా తీశారు.అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొన్న రాదని మీపై నిరంతరం నిఘా ఉంటుందని,పోలీసుల మాటలను వినకుండా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పీడీ యాక్ట్, బైండోవర్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారులు హెచ్చరించారు.

# సమాజ మార్పుకై నాటకరంగ కళను ఆయుధంగా మలిచిన మహనీయుడు

## తెలుగు నాటక రంగ పితామహుడు బళ్ళారి రాఘవ

### అడిషనల్ ఎస్పి అడ్మిన్ ఖాదర్ బాషా





**నంద్యాల క్రైం, ఆగష్టు 2, (రిపబ్లిక్ న్యూస్):** తెలుగు నాటక రంగానికి ప్రాణం పోసిన మహనీయుడు, గొప్ప సామాజిక సేవకుడు బళ్ళారి రాఘవ జయంతిని పురస్కరించుకుని నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్ ఆదేశాల మేరకు నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా పోలీస్ శాఖ తరపున ఎస్పీ అడ్మిన్ ఖాదర్ భాషా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఖాదర్ బాషా మాట్లాడుతూ బళ్ళారి రాఘవ కేవలం ఒక నాటక కళాకారుడు మాత్రమే కాదని, తన కళ ద్వారా సమాజంలో నెలకొన్న దురాచారాలను ప్రశ్నించిన గొప్ప సంస్కర్త అని కొనియాడారు. ఆయన ప్రదర్శనలు కేవలం వినోదానికి మాత్రమే పరిమితం కాకుండా, ప్రజల్లో ఆలోచనలు రేకెత్తించి, నైతిక విలువలను పెంపొందించేలా ఉండేవని గుర్తుచేశారు. సమాజంలో మానవత్వం వంటి ఉన్నత విలువలను తన జీవితాంతం పాటించిన బళ్ళారి రాఘవ జీవితం యువతకు ఎంతో ఆదర్శప్రాయమని అదనపు ఎస్పీ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఒక బాధ్యతాయుతమైన పౌరుడిగా తమ కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ, సమాజానికి మేలు చేయడమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి అని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ చిన్నికృష్ణ, రిజర్వు ఇన్స్పెక్టర్లు బాబు, విజయ్, సురేష్ ఆర్ఎస్ఐలు హర్షవర్ధన్ రెడ్డి, చరణ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com